

శ్రీ పొట్టిశ్రీరాములు నెల్లూరు
వార్త

# ముఖ్యమంత్రి దృష్టికి నెల్లూరు సమస్యలు

## కలెక్టర్స్ కాన్ఫరెన్స్ లో నెల్లూరు జిల్లా కలెక్టర్ హిమాన్షు శుక్ల



**నెల్లూరు కలెక్టరేట్, డిసెంబర్ 17, ప్రభాతవార్త :** తమిళనాడు నుండి మా నెల్లూరు జిల్లాలోని సముద్ర జలాల్లోనికి అక్రమంగా బోట్లు వస్తున్నాయి. దీనివల్ల మా జిల్లా మత్స్యకారులు చాలా ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని.. అక్రమంగా తమిళనాడు బోట్లు రాకుండా శాశ్వత చర్యలు తీసుకోవాలని జిల్లా కలెక్టర్ హిమాన్షు శుక్ల ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడుకి విన్నవించారు. అమరావతిలోని సచివాలయంలో బుధవారం ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు ధ్యక్షతన నిర్వహించిన కలెక్టర్ల కాన్ఫరెన్స్ లో మొదటి రోజు జిల్లా కలెక్టర్ హిమాన్షు శుక్ల తమిళనాడు నుంచి చేపల వేట పడవలు ఆంధ్రప్రదేశ్ సముద్ర జలాల్లోకి అక్రమంగా ప్రవేశించడం, గృహ నిర్మాణ పథకం – ఆప్షన్-3కు సంబంధించి విజిలెన్స్ విచారణ ఆదేశాలు – ఏదైనా పరిష్కారం కనుగొని పనులు ప్రారంభించేందుకు అనుమతించాలని, జువ్వలదిన్నె హార్బర్‌ను కార్యాచరణలోకి తీసుకురావడం.

❖ రాబోయే ఖరీఫ్ సీజన్‌కు నెల్లూరు జిల్లాకు వరి కొనుగోలు లక్ష్యం నిర్ణయం..తదితర అంశాలను ముఖ్యమంత్రి దృష్టికి తీసుకెళ్లారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ..తమిళనాడు లోని పాండిచ్చేరి, కారేకల్..నుండి అక్రమంగా మా నెల్లూరు సముద్ర తీర ప్రాంతంలోకి ముందుగా రెండు బోట్స్ రావడంతో ..వాటిని పట్టుకుని సీజ్ చేసి కేసులు నమోదు చేయడం జరిగింది. కొంతకాలం తర్వాత మరో రెండు బోట్లు రావడంతో వాటిని కూడా పట్టుకుని కేసులు నమోదు చేసాం. కానీ ఇలా తరచుగా రావడం మా మత్స్యకారులకు ఇబ్బంది , నష్టం జరుగుతుందని.. ఆ బోట్స్ రాకుండా ఈ సమస్యను శాశ్వతంగా పరిష్కరించేందుకు చర్యలు తీసుకోవాలని ముఖ్యమంత్రి కి విజ్ఞప్తి చేశారు.

❖ పీ ఎం ఈ వై 1.0 క్రింద 28,000 వేలు ఇల్లు మంజూరు అయ్యాయి. వీటిలో 6 వేల ఇళ్ల నిర్మాణాలు పూర్తిచేసుకోగా, 7 వేల ఇల్లు స్లాబ్ పూర్తిచెసుకున్నాయన్నారు. మిగిలినవి వివిధ దశల్లో పురోగతిలో ఉన్నాయన్నారు. ఈ ఇళ్ల నిర్మాణాలను ఆప్షన్ 3 ఏజెన్సీస్ ద్వారా పూర్తిచేయుటకు చర్యలు తీసుకోవాలన్నారు.ఈ ఖరీఫ్ సీజన్లో 1.50 లక్షల వరి ధాన్యం సేకరణ చేయాలని అంచనాలు/ టార్గెట్ ఇచ్చింది. అయితే మిగిలిన జిల్లాలోతో మా నెల్లూరు జిల్లాను పోల్చుకుంటే ఇక్కడ ఎర్లీ రబీ, లేట్ ఖరీఫ్ ( అక్టోబర్ 1 మార్చి 31 వరకు) ఉంటుంది. అందులోను ఖరీఫ్ లో ఇప్పటికే అక్టోబర్ మాసంలో 10, 214 టన్నుల ధాన్యాన్ని కొనుగోలు చేశాం. మిగిలినది లేట్ ఖరీఫ్ లో కొనుగోలు చేస్తామని ముఖ్యమంత్రి దృష్టికి తీసుకెళ్లారు.

## సోమశిల నీటిమట్టం



**అనంతసాగరం, డిసెంబరు 17, ప్రభాతవార్త:** మండలంలోని సోమశిల జలాశయానికి ఎగువ ప్రాంతాల నుంచి బుధవారం సాయంత్రానికి 6015 క్యూసెక్కుల వంతున వరద ప్రవాహం నమోదైంది. జలాశయం పూర్తిసామర్థ్యం 78 టిఎంసిలు కాగా ప్రస్తుతం జలాశయం లో 74.908 టిఎంసిల నీరు నిల్వ ఉంది. ఎస్ఎఫ్‌సికి 200, ఎన్ఎఫ్‌సికి100, పెన్నా డెల్టా 0, కండలేరు వరద కాలువకు 2000 క్యూసెక్కులు, పెన్నా నదికి2650 క్యూసెక్కుల వంతున నీటిని విడుదల చేస్తున్నారు. ప్రస్తుతం 100.160 మీటర్ల మేర నీటిమట్టం నమోదైందని జలాశయం అధికారులు తెలిపారు.

# జిల్లాల పునర్విభజనపై ప్రజల మండిపాటు : కాకాణి



**నెల్లూరు రూరల్, డిసెంబర్ 17, ప్రభాతవార్త :** నెల్లూరు జిల్లా వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో జిల్లాల పునర్విభజనలో కలువాయి మండలాన్ని నెల్లూరు జిల్లాలోనే కొనసాగేలా ప్రభుత్వంపై ఒత్తిడి తేవాలని మాజీ మంత్రి ఉమ్మడి నెల్లూరు జిల్లా వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు డా॥కాకాణి గోవర్ధన్ రెడ్డి గారిని కోరిన వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు

❖ కలువాయి, రాపూరు, సైదాపురం మండలాలను నెల్లూరు జిల్లా నుండి విడగొట్టడంపై కాకాణి మండిపాటు. పార్టీ ఆదేశాలమేరకు వెంకటగిరి నియోజకవర్గ ఇన్చార్జ్ నేదురుమల్లి రామ్ కుమార్ రెడ్డి గారితో కలిసి కార్యాచరణ రూపొందిస్తామన్న కాకాణి.

**స్క్రోలింగ్ పాయింట్స్:**

అసమర్థుడు అధికారంలో ఉంటే, ఫలితాలు ఏవిధంగా ఉంటాయి అన్నదానికి, చంద్రబాబు జిల్లాల పునర్విభజన నిర్ణయాలు ఉదాహరణగా నిలుస్తున్నాయి. చంద్రబాబు లేని సమస్యలను సృష్టించి, ప్రజల మనోభావాలకు భిన్నంగా ప్రవర్తిస్తుండడంతో, ప్రజలు రోడ్డెక్కి పోరాటాలు, నిరసనలు తెలియజేస్తున్నారు. ఎన్నికల్లో గూడూరు నియోజకవర్గాన్ని నెల్లూరు జిల్లాలో చేరుస్తానని చంద్రబాబు, లోకేషులు గూడూరు ప్రజలకు హామీ ఇచ్చారు

❖ చంద్రబాబు ఇచ్చిన మాటను నిలబెట్టుకోకపోగా, నెల్లూరు జిల్లాలో అంతర్భాగంగా ఉన్న కలువాయి, సైదాపురం, రాపూరు మండలాలను తిరుపతి జిల్లాలో చేర్చడం దారుణం.

❖ చంద్రబాబు దుర్మార్గపు నిర్ణయాలు, భావితరాలకు శాపాలుగా మారుతున్నాయి. కలువాయి, సైదాపురం, రాపూరు మండలాలను తిరుపతి జిల్లాలో చేర్చడం వల్ల, అక్కడి ప్రజలు తమ అస్థిత్వాన్ని కోల్పోతారు

❖ జిల్లా కేంద్రానికి 150 కిలోమీటర్లు వెళ్లాలంటే, ఆ మండలాల ప్రజలు తీవ్ర ఇబ్బందులకు గురయ్యే పరిస్థితులు ఏర్పడుతాయి రాపూరు, కలువాయి, సైదాపురం మండలాలు నెల్లూరు జిల్లా రైతాంగంతో సాగునీరు, రెవిన్యూ పరమైన విషయాలతో అనుబంధ సంబంధాలను ముడివేసుకొని ఉన్నారు. జగన్మోహన్ రెడ్డి స్థానిక ప్రజల సమస్యలు చెప్పుకునేందుకు ప్రజాప్రతినిధులకు స్వేచ్ఛ, స్వాతంత్ర్యాన్ని ఇచ్చారు

❖ జిల్లాల పునర్విభజనలో స్థానిక ప్రజల సమస్యలను ఆనాడు ముఖ్యమంత్రి జగన్మోహన్ రెడ్డి గారి దృష్టికి తీసుకొని వెళ్లితే, సానుకూలంగా స్పందించి, మూడు మండలాలను నెల్లూరు జిల్లాలోనే కొనసాగించారు

❖ కలువాయి, రాపూరు, సైదాపురం మండలాలు నెల్లూరు జిల్లా నుండి విడిపోతే సర్వేపల్లి రైతులకు సాగునీటి కష్టాలు తప్పవు

❖ సర్వేపల్లి నియోజకవర్గానికి భౌగోళికపరంగా కలువాయి, రాపూరు, సైదాపురం నెల్లూరు జిల్లాతోనే కలిసి ఉండటం చాలా అవసరం

❖ నోరు మెదపకూడదని నియంతలా చంద్రబాబు ఆదేశాలు జారీ చేయడంతో, జిల్లా ప్రజలకు అన్యాయం జరుగుతున్నా, జిల్లాకు చెందిన తెలుగుదేశం నాయకులు నోరు విప్పడం లేదు.

❖ సోమిరెడ్డి మాత్రం ప్రతిపక్ష నాయకుడి లాగా లేఖలు రాసి, మభ్య పెట్టాలని ప్రయత్నిస్తున్నాడు

❖ అధికార పార్టీలో ఉన్న సోమిరెడ్డి చంద్రబాబుపై ఒత్తిడి తెచ్చి ఒప్పించే ప్రయత్నం చేయడం లేదు

❖ చంద్రబాబు రెండు కళ్ల సిద్ధాంతంతో నెల్లూరు జిల్లా ప్రజలకు తీరని ద్రోహం చేస్తున్నాడు

❖ పార్టీలకతీతంగా కూటమి పార్టీలో భాగస్వాములైన పార్టీలు కూడా చంద్రబాబు నిర్ణయాన్ని తప్పుబట్టు తున్నారు

❖ ప్రశాంతంగా ఉన్న ప్రాంతంలో విద్వేషాలు రెచ్చగొట్టేలా, చంద్రబాబు నిర్ణయాలు తీసుకుంటున్నాడు చంద్రబాబు ఇచ్చిన హామీని నిలబెట్టుకోవడం లేదు. కందుకూరు నియోజకవర్గాన్ని ప్రకాశం జిల్లాలో చేర్చిన విధంగా, చంద్రబాబు గూడూరు ప్రజలకు ఇచ్చిన హామీకి కట్టుబడాలి.

❖ స్థానిక అధికార పార్టీ నాయకులు రాజకీయ ప్రయోజనాలను విడిచి, జిల్లా ప్రజల ప్రయోజనాల కోసం చంద్రబాబు వద్ద తమ గళం వినిపించాలని కోరుతున్నాం

❖ అందరితో ఆత్మీయ సంబంధాలు కలిగిన రాపూరు, సైదాపురం, కలువాయి ప్రాంతాలను వదులుకోవడం, తమ ఆస్తిని కోల్పోయిన భావన కలుగుతుంది

❖ చంద్రబాబు నియంతృత్వ పోకడలను వీడి, గూడూరు ప్రజలకు ఇచ్చిన హామీ ప్రకారం గూడూరు నియోజకవర్గాన్ని నెల్లూరు జిల్లాలో కలపడంతో పాటు, నెల్లూరు జిల్లాలో ఉన్న కలువాయి, సైదాపురం, రాపూరు మండలాలను నెల్లూరు జిల్లాలోనే కొనసాగేలా చర్యలు చేపట్టాలని వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ తరఫున డిమాండ్ చేస్తున్నాను

# పోలియోపై అధికారులతో సమీక్ష : ఇన్‌చార్జ్ కమిషనర్

### గోడపత్రికలను ఆవిష్కరించిన అధికారులు





**నెల్లూరు కార్పోరేషన్, డిసెంబర్ 17 ప్రభాతవార్త :** ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం ఆరోగ్య కుటుంబ సంక్షేమశాఖ ఆద్వర్యంలో 21వ తేది ఆదివారం నిర్వహించనున్న పోలియో దినం కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని నెల్లూరు నగరపాలక సంస్థ ఇన్‌చార్జ్ కమీషనర్ ఎం.శ్రీలక్ష్మి తెలిపారు. ఈ మేరకు కార్యాలయంలోని కమాండ్ కంట్రల్ సెంటర్ విభాగంలో జిల్లా వైద్య ఆరోగ్యశాఖ ప్రతినిధులతో కలసి కార్యక్రమం గోడపత్రికలను బుధవారం ఆవిష్కరించారు. ఈ సందర్భంగా కమీషనర్ మాట్లాడుతూ ఐదేళ్ళలోపు వయసు కలిగిన చిన్నారులందరికి తప్పనిసరిగా సమీప సచివాలయంలో పోలీయో చుక్కలు వేయించాలని సూచించారు. పోలియో మహమ్మారిని నిర్మూలించేందుకు రాష్ట్ర ప్రభుత్వం చేపట్టిన ఈ కార్యక్రమం పట్ల ప్రజలందరికి అవగాహన కల్పించి చిన్నారులకు పోలియో చుక్కలు వేయించేలా తల్లిదండ్రులకు సమాచారం అందించాలని కమీషనర్ సూచించారు. ఈ కార్యక్రమంలో డిఐఓ ఉమామహేశ్వరి, డాక్టర్ జిజియా, డీపీఎంఓ డాక్టర్ సునీల్, డిఎస్ఓ మల్లికార్జునరావు, అర్బన్ మెడికల్ ఆఫీసర్లు, డిప్యూటి హెల్త్ ఎడ్యుకేషనల్ ఆఫీసర్ అశోక్, సిబ్బంది పాల్గొన్నారు.

# రెవిన్యూ రికార్డులు పరిశీలించిన జాయింట్ కలెక్టర్

**బుచ్చి డిసెంబర్ 17 ప్రభాతవార్త**



బుచ్చిరెడ్డిపాళెం తహసిల్దారు కార్యాలయాన్ని జాయింట్ కలెక్టర్ మొగిలి వెంకటేశ్వర్లు ఆఖస్మికంగా తనీఖి చేశారు. ఈ సందర్బంగా ఆయన పలు రికార్డులు పరిశీలించారు. అనంతరం విలేఖర్లతో మాట్లాడుతు ప్రతి వారం ప్రజా విజ్ఞప్తుల దినోత్సవ కార్యక్రమంలో ఆకుల మల్లికార్జున అనే వ్యక్తి వచ్చి తన సమస్యలను పరిష్కరించమని కోరుతున్నాడని ఆయన తెలిపారు. మల్లికార్జునకు సంబందించి సంగం మండలంలో 129 లో 40 సెంట్లు దువ్వూరు పరిధిలో 88 లో 7 సెంట్లు ఉందని తనకు సంబందించిన పొలం ఇరిగేషన్ కెనాల్ లో ఉందని ఆయన వాదన అని తెలిపారు. అయితే గతంలో సర్వే చేయగా అందులో ఆయన పొలంలో ఏమిలేదని తేలిందని జెసి తెలిపారు. 130 లో నాలుగు సబ్‌డివిజన్‌లు చేసి కాలువ చూపించడం జరిగిందని అన్నారు. ఆర్ఎస్ఆర్ కూడా పరిశీలించడం జరిగిందని అన్నారు.ఇది అంతా సక్రమంగా చేయడం లేదన్నది మల్లికార్జున వాదన, అందువల్ల పీల్డ్ మీదకు వెళ్లి పరిశీలిస్తామని అన్నారు.ఈ కార్యక్రమంలో తహసిల్దారు అంబటి వెంకటేశ్వర్లు,డిప్యూటి తహసిల్దారు మల్లికార్జున, ఆర్ఐ శాంతి,రెవిన్యూ సిబ్బంది పాల్గొన్నారు.

# విద్యుత్ శాఖ మంత్రి గొట్టిపాటి రవి దృష్టికి నేలటూరు ఏపీ జెన్‌కో సమస్యలు



**నెల్లూరు, డిసెంబర్ 17, ప్రభాతవార్త -వైద్యం** సర్వేపల్లి శాసనసభ్యులు సోమిరెడ్డి చంద్రమోహన్‌రెడ్డి ఆధ్వర్యంలో అమరావతిలో మంత్రిని కలిసిన నేలటూరు వాసులు, ముత్తుకూరు మండల టీడీపీ నాయకులు. నిర్వాసితులకు ఉద్యోగ అవకాశాలు, నేలటూరు పంచాయతీతో పాటు దేవరదిబ్బ గిరిజన కాలనీ తరలింపు, పునరావాస కాలనీల నిర్మాణం, నేలటూరు ఎస్సీ కాలనీ ఆర్అండ్‌బి కాలనీకి భూసేకరణ, అనేక ఏళ్లుగా తాత్కాలిక ప్రాతిపదికన ఉద్యోగాలు చేస్తున్న వారిని పర్మినెంట్ చేయడం తదితర సమస్యలపై మంత్రికి వినతి.

# కలెక్టర్ల కాన్ఫరెన్స్‌లో జిల్లా కలెక్టర్ హిమాన్ష శుక్ల



**కలెక్టరేట్, డిసెంబర్ 17, ప్రభాతవార్త** బుధవారం రాష్ట్ర అమరావతిలోని సచివాలయంలో ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు అధ్యక్షతన నిర్వహించిన 5వ కలెక్టర్ల కాన్ఫరెన్స్‌లో, రాష్ట్ర వ్యాప్తంగా అన్ని జిల్లాల కలెక్టర్‌లు పాల్గొన్నారు. ఈ మేరకు నెల్లూరు జిల్లా కలెక్టర్ హిమాన్షు శుక్ల కూడా ఈ కాన్ఫరెన్స్‌లో పాల్గొనడం జరిగింది.

# కొండబిట్రగుంట సమీపంలో జాతీయ రహదారిపై అండర్ పాస్ ఏర్పాటు చేయండి

- చిన్న తిరుమలగా కొండ బిట్రగుంట ఆలయం ప్రసిద్ధి చెందింది
- ఆలయానికి నిత్యం భక్తులు వస్తుంటారు. బ్రహ్మోత్సవాల సమయంలో ఈ సంఖ్య అధికం
- ఈ మంగమూరు తోటలు ప్రాంతంలో నిత్యం రహదారి ప్రమాదాలు చోటు చేసుకుంటున్నాయి
- కొండ్ర బిట్రగుంటకు వెళ్ళే మంగమూరు తోటలు ప్రాంతాన్ని బ్లాక్ స్పాట్‌గా గుర్తించండి
- భక్తుల రక్షణకు సరైన భద్రతా చర్యలు చేపట్టండి
- కేంద్ర జాతీయ రహదారుల శాఖ మంత్రి నితిన్ గడ్కరీకి ఎంపీ వేమిరెడ్డి ప్రభాకర్‌రెడ్డి వినతి



**నెల్లూరు రూరల్, డిసెంబర్ 17, ప్రభాతవార్త** నెల్లూరు జిల్లా కావలి నియోజకవర్గం కొండ బిట్రగుంట ఆలయానికి వస్తున్న భక్తుల రక్షణార్థం జాతీయ రహదారిపై కొండబిట్రగుంట సమీపంలోని మంగమూరు తోటలు సెంటర్ వద్ద వెహికల్ పాస్ ఏర్పాటు చేయాలని నెల్లూరు పార్లమెంట్ సభ్యులు వేమిరెడ్డి ప్రభాకర్‌రెడ్డి కేంద్ర జాతీయ రహదారులు శాఖ మంత్రి నితిన్ గడ్కరీ కి విన్నవించారు. అలాగే ఈ ప్రాంతాన్ని బ్లాక్ స్పాట్‌గా గుర్తించి తగిన చర్యలు తీసుకోవాలని విజ్ఞప్తి చేశారు. బుధవారం ఈ మేరకు ఢిల్లీలో కేంద్ర మంత్రిని కలిసిన ఆయన ఇక్కడ తీసుకోవాల్సిన చర్యలపై మాట్లాడారు. బోగోలు మండలంలో జాతీయ రహదారి – 16 నుండి 5 కి.మీ దూరంలో శ్రీ ప్రసన్న వెంకటేశ్వరస్వామి ఆలయం అనే ప్రసిద్ద ఆలయం ఉందన్నారు. ఈ ఆలయానికి తమిళనాడు రాష్ట్రం, నలెక్టూరు, అల్లూరు, కావలి, ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలోని వివిధ ప్రాంతాల నుండి భక్తులు పెద్ద ఎత్తున తరలివస్తుంటారని, దాంతో ఇది మరో తిరుమలగా ప్రసిద్ధి చెందిందన్నారు. వార్షిక బ్రహ్మోత్సవాల సమయంలో ప్రతి రోజు సుమారు 20,000 మంది భక్తులు ఆలయాన్ని సందర్శిస్తారని తెలిపారు. భక్తులు ఆలయానికి వెళ్లడానికి ఎన్‌హెచ్-16 నుండి కొండ బిట్రగుంట బ్రాంచ్ రోడ్డుకు మళ్ళించారని, ఈ జంక్షన్‌ను మంగమూరు తోటలు సెంటర్‌గా పిలుస్తారని పేర్కొన్నారు. ప్రస్తుతం మంగమూరు తోటల సెంటర్ వద్ద ఉన్న జంక్షన్ ప్రధాన ట్రాఫిక్ పాయింట్‌గా మారిందని, దీంతో తరచుగా రోడ్డు ప్రమాదాలు జరుగుతున్నాయని వివరించారు. ఈ జంక్షన్‌లో భారీ ట్రాఫిక్ దృష్ట్యా, కొండ బిట్రగుంట బ్రాంచ్ రోడ్డులోకి ప్రవేశించడానికి జాతీయ రహదారికి అవతలి వైపు దాటేటప్పుడు తరచుగా ప్రమాదాలు జరుగుతున్నాయని, కొన్ని సంవత్సరాల్లో దాదాపు 500కి పైగా ప్రమాదాలు జరిగాయని, పేర్కొన్నారు. దాంతో ప్రజలు/ భక్తులు ప్రాణాలు కోల్పోయారని, చాలా మందికి తీవ్ర గాయాలు అయ్యాయని అన్నారు. ఈ నేపథ్యంలో ప్రజల అభ్యర్థనను పరిగణలోకి తీసుకుని బోగోలు మండలం, ఎన్‌హెచ్-16లోని మంగమూరు తోటల సెంటర్ జంక్షన్ వద్ద ప్లైఓవర్ వెహికల్ అండర్ పాస్ (వీయుపీ) నిర్మాణానికి ఆమోదం తెలియజేయాలని అభ్యర్థించారు. దీనిపై సానుకూలంగా స్పందించిన కేంద్ర మంత్రి నితిన్ గడ్కరీ.. పరిశీలించి తగిన చర్యలు తీసుకుంటామని స్పష్టం చేశారు.

# ఉపరాష్ట్రపతి రాధాకృష్ణన్‌ను కలిసిన ఎంపీ వేమిరెడ్డి



**నెల్లూరు, డిసెంబర్ 17, ప్రభాతవార్త -వైద్యం** భారత ఉప రాష్ట్రపతి సీపీ రాధాకృష్ణన్‌ని నెల్లూరు పార్లమెంట్ సభ్యులు వేమిరెడ్డి ప్రభాకర్‌రెడ్డి మర్యాదపూర్వకంగా కలిశారు. బుధవారం ఢిల్లీలోని ఉప రాష్ట్రపతి కార్యాలయానికి వెళ్లిన ఎంపీ వేమిరెడ్డి ఈ సందర్భంగా ఆయనను శాలువాతో ఘనంగా సత్కరించారు. శ్రీవారి ప్రసాదాలు అందజేశారు. ఈ సందర్భంగా ఎంపీ వేమిఎడ్డి ఆయనతో వివిధ అంశాలపై మాట్లాడారు.

# ఇకపై రాష్ట్రంలో స్పీడ్ ఆఫ్ డెలివరింగ్ గవర్నెన్స్

- కలెక్టర్లే బ్రాండ్ అంబాసిడర్లు.. గ్రీవెన్సుల సత్వర పరిష్కారంపై దృష్టి..
- ప్రజల్లో సంతృప్త స్థాయే ప్రభుత్వానికి ముఖ్యం.. - 5వ జిల్లా కలెక్టర్ల కాన్ఫరెన్స్‌లో సీఎం చంద్రబాబు దిశానిర్దేశం

**నెల్లూరు కలెక్టరేట్, డిసెంబర్ 17, ప్రభాతవార్త** ఆంధ్రప్రదేశ్‌లో ఇక నుంచి స్పీడ్ ఆఫ్ డెలివరింగ్ గవర్నెన్సు ఉండాలని ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు జిల్లా కలెక్టర్లకు దిశానిర్దేశం చేశారు. స్పీడ్ ఆఫ్ డూయింగ్ బిజినెస్ తరహా విధానాన్నే పరిపాలనలోనూ తెస్తున్నట్టు సీఎం ప్రకటించారు. రాష్ట్ర సచివాలయంలో బుధవారం 5వ జిల్లా కలెక్టర్ల సమావేశంలో వివిధ అంశాలపై కలెక్టర్లకు సీఎం సూచనలు జారీ చేశారు. త్వరితగతిన ఫిర్యాదుల పరిష్కారంతో పాటు జిల్లా కలెక్టర్లు, అధికారుల పనితీరును స్పీడ్ ఆఫ్ డెలివరింగ్ గవర్నెన్సే కొలమానంగా తీసుకుంటామని స్పష్టం చేశారు. ఈ సందర్భంగా ముఖ్యమంత్రి మాట్లాడుతూ ప్రజల్లో ప్రభుత్వం పట్ల సానుకూలత, సంతృప్తి పెరిగేలా చూడాల్సిన బాధ్యత కలెక్టర్లదే. ఇళ్లు లేని పేదలు, రైతులు, మహిళలు, పిల్లలు, యువత ఇలా అన్ని వర్గాలకు మంచి చేయడం ద్వారా ప్రజల్లో సానుకూలత వస్తుంది. ప్రభుత్వ పాలనకు జిల్లా కలెక్టర్లే బ్రాండ్ అంబాసిడర్లుగా ఉంటారు. దీన్ని గుర్తుపెట్టుకుని కలెక్టర్లు పని చేయాలి. పొలిటికల్ గవర్నెన్స్ అనేది కీలకం. కొన్ని అంశాల్లో ప్రజా ప్రతినిధుల సూచనలు అమలయ్యేలా చూడాలి. అలాగే వారి సేవలను కూడా వినియోగించుకోవాలి. వివిధ జిల్లాల్లో అనుసరించే బెస్ట్ ప్రాక్టీసెస్ ఇతర ప్రాంతాల్లోనూ అమలు చేయాల్సిన అవసరం ఉంది. ప్రజల నుంచి వచ్చిన గ్రీవెన్సులను కూడా వేగంగా పరిష్కరించి పారదర్శకంగా ఆన్ లైన్‌లో ఉంచండి. లిటిగేషన్లపై ప్రజల్లో చైతన్యం పెంచి వాటిని పరిష్కరించుకునేలా అవగాహన పెంచుదాం. చేసిన అభివృద్ధి పనుల్ని ప్రజలకు తెలియచేసేలా సామాజిక మాధ్యమాల్లోనూ ప్రచారం చేయాలని సూచించారు. ప్రభుత్వం నిర్దేశించిన పది సూత్రాలను పటిష్టంగా అమలు చేసి 15% శాతం వృద్ధి రేటు సాధనలో భాగస్వాములు కావాలని కలెక్టర్లకు దిశానిర్దేశం చేశారు.

# "సేవ్ కలువాయి అంటూ" జలదీక్ష చేస్తున్న ప్రజలు

- పెన్నానదిలో దిగి ఆందోళనకు శ్రీకారం చుట్టిన వైనం
- 9 వరోజుకు చేరిన దీక్షలు





**కలువాయి, డిసెంబర్ 17, ప్రభాతవార్త :** "సేవ్ కలువాయి అంటూ" కలువాయి మండలం ప్రజలు వినూత్న తరహాలో పెన్నానదిలో దిగిరి ఆందోళనకు శ్రీకారం చుట్టారు. నదిలో దిగి జలదీక్ష చేశారు.ఈ సందర్భంగా వారు మాట్లాడుతు కలువాయిని నెల్లూరులో కలిపే వరకు తమ ఉద్యమం ఆగదని హెచ్చరించారు. ఏప్రాతిపదికన కలువాయిని తిరుపతిలో కలుపుతారని వారు ప్రశ్నించారు. రాజకీయ స్వార్ధంతో కలువాయిని తిరుపతిలో కలిపితే ఉద్యమం మరింత తీవ్ర తరం చేస్తామని వారు హెచ్చరించారు. స్థానిక బస్టాండ్ కూడలి నందు 9 వ రోజు రిలే నిరాహార దీక్షలో గ్రామ మాజీ సర్పంచ్ విశ్రాంత ఉపాధ్యాయులు గుడిగుంట శ్రీనివాసులతోపాటు ఉయ్యాలపల్లి గ్రామ ప్రజలు నిరహారదీక్షలో పాల్గొనగా యూటిఎఫ్,విఒఎలు ఆశా, పొదుపు మహిలు సంఘీబావం తెలిపారు "గురవారం స్వచ్ఛంధ" బంధకు జెఏసి పిలుపునిచ్చింది.మండలంలోని వ్యాపారసంస్థలు, విద్యాసంస్థలు, ప్రవేటు కార్యాలయాలు స్వచ్ఛంధంగా మూసివేయనున్నట్లు ఆందోళన కారులు తెలిపారు.అలాగే ప్రభుత్వ కార్యాలయాలు మూపిస్తామని వారు పేర్కున్నారు. అదే విధంగా సాయింత్రం 7 గంటల సమయంలో మండలంలోని ప్రజలందరు సెల్‌పోన్ లైట్లతో నిరసన తెలపాలని వారు తెలిపారు.

# కలువాయిని తిరుపతిలో ఎందకు కలపాలి

- మాజీ ఉపరాష్ట్రపతి వెంకయ్యనాయుడు
- మాజీ ఉపరాష్ట్రపతినిన కలిసిన కలువాయి నేతలు



**కలువాయి, డిసెంబర్ 17, ప్రభాతవార్త :** కలువాయి మండలానికి అన్ని విధాల సౌకర్యంగా ఉండే నెల్లూరు జిల్లాను వదలి తిరుపతి జిల్లాలో కలపవల్సిన అవసరం ఏమి వచ్చిందని మాజీ ఉపరాష్ట్రపతి వెంకయ్యనాయుడు అన్నారు. బిజెపి రాష్ట్ర కార్యవర్గ సభ్యులు వెంకటగిరి నియోజకవర్గ కన్వీనర్ కలువాయి మండల వాసి ఎస్ఎస్ఆర్ నాయుడు ఆద్వర్యంలో తిరుపతి జిల్లా వద్దు, నెల్లూరు జిల్లా ముద్దు ఉద్యమ కలువాయి జెఏసి, టిడిపి సీనియర్ నాయకులు, బిజెపి, రాపూరు,కలువాయి, సైదాపురం నాయకులు కలిసి విజయవాడ దగ్గర స్వర్ణభారత్ ట్రస్టులో బుధవారం మాజీ ఉపరాష్ట్ర పతి వెంకయ్యనాయుడ్ని కలిసి వెంకయ్యనాయుడుకి వినతి పత్రం అందజేశారు. తిరుపతి జిల్లాలో మూడు మండలాలు కలపడం వల్ల అన్ని వర్గాల ప్రజలు ఎదుర్కొనే సమస్యలను ఈ సందర్భంగా వెంకయ్యనాయుడుకి తెలియజేశారు. మా ప్రాంత వాసుల మొర ఆలకించి రాష్ట్ర ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు దృష్టికి తీసుకొని వెళ్ళి న్యాయం చేయాలని ఈ సందర్భంగా వారు మాజీ ఉపరాష్ట్రపతిని కోరారు.ఈకార్యక్రమంలో మండల టిడిపినాయకులు, నాగిరెడ్డి రాజారెడ్డి,పెరంకొండ వేణునాయుడు, మజ్జిగ పెంచలరెడ్డి, రాపూరు దశరదరామిరెడ్డి, సుల్తాన్, బిజెపి సీనియం నాయకులు, సన్నపనేని వేణుగోపాల్‌నాయుడు,రాపూరు ఎఎంసి డైరక్టర్ దండు పెంచలయ్య,కలువాయి బిజెపి అద్యక్షులు జి.మల్లికార్జుననాయుడు,రాపూరు బిజెపి అద్యక్షులు దూడల పెంచలయ్య, తదితరులున్నారు.

## రేపు మెగా జాబ్ మేళా

**ముత్తుకూరు, డిసెంబర్ 17, ప్రభాతవార్త :** ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర నైపుణ్యాభివృద్ధి సంస్థ ఆధ్వర్యంలో 19వ తేది శుక్రవారం మెగా జాబ్ మేళా నిర్వహిస్తున్నట్లు మండల పార్టీ అధ్యక్షులు నీలం మల్లికార్జున యాదవ్ తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ముత్తుకూరు మండల కేంద్రంలోని మత్స్య కళాశాలలో ఈ నెల 19వ తేది 9 గంటలకు జాబ్ మేళా నిర్వహిస్తున్నట్లు తెలిపారు. అభ్యర్థులు పోర్టల్‌లో నమోదు చేసుకుని అలాట్మెంట్ లెటర్లతో రావాలని పేర్కొన్నారు.

## గొల్లపల్లిలో ఉచిత పశువైద్యశిబిరం

**చేజర్ల డిసెంబర్ 17 ప్రభాతవార్త :** చేజర్ల మండలం గొల్లపల్లి గ్రామంలో రాష్ట్రీయ గోకుల్ మిషన్ పథకం కింద ఉచిత పశు గర్భకోశ వ్యాధుల చికిత్స శిబిరం బుధవారం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఎగ్జిక్యూటివ్ ఆఫీసర్ డిఎల్డిఏ పశువైద్యాధికారి డి.శ్రీనివాసరావు ,ఉపసంచాలకులు నెల్లూరు డివిజన్ పశు వైద్యాధికారిణి డి నాగమణి, సహాయ సంచాలకులు



ప్రాంతీయ పశువైద్యశాల కలువాయి పశువైద్యాధికారిని ఎస్ గురుజయంతి ముఖ్య అతిధులుగా హాజరయ్యారు. అనంతరం వైద్యశిబిరంలో పశువులను పరీక్షలు నిర్వహించి ఉచితంగా మందులు పంపిణీ చేశారు. పశువుల గురించి పలు సూచనలు సలహాలు పాడి రైతులకు తెలియజేశారు. ఈకార్యక్రమంలో చింతలాత్మకూరు పశువైద్యాధికారి డాక్టర్ సిహెచ్ కృష్ణమోహన్, దాచూరు పశువైద్యాధికారి డా సి హెచ్ కృష్ణ ప్రసాద్,చేజర్ల పశువైద్యాధికారి డాక్టర్ పి రాజేష్ పశువైద్యసిబ్బంది తెలుగుదేశం పార్టీ నాయకులు ఉడతా హజరత్తయ్య, పాడి రైతులు పాల్గొన్నారు.

## వైకాపా రాష్ట్ర కార్యదర్శి విసిఆర్‌కు సన్మానం

**కొడవలూరు,డిసెంబర్ 17 ప్రభాతవార్త :** వైఎస్ఆర్ సిపి రాష్ట్ర కార్యదర్శి డీసీఎంఎస్ మాజీ ఛైర్మన్‌ను వీరి చలపతిరావును పెమ్మారెడ్డిపాలెం గ్రామ సర్పంచ్ నవీన్ మర్యాదపూర్వకంగా కలిసి శాలువ కప్పి సత్కరించారు. అదే విధంగా మండల వైకాపా నాయకులు కూడా పుష్పగుచ్ఛం అందజేసి ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో కోవూరు నియోజకవర్గ



ఎస్‌సిసెల్ అధ్యక్షులు ఆనపల్లి ఉదయభాస్కర్, విద్యార్థి సంఘ నాయకులు సాయి తదితరులు పాల్గొన్నారు.

## సచివాలయానికి,పిఎం,సిఎం,డిప్యూటి సిఎం పోటీలు

**సీతారామపురం డిసెంబర్ 17 ప్రభాతవార్త :** సీతారామపురం మండలంలోని అయ్యవారిపల్లి సచివాలయంకి ప్రధాన మంత్రి నరేంద్రమోడీ ,ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు , ఉపముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్, ఉదయగిరి నియోజకవర్గ శాసనసభ్యులు కాకర్ల సురేష్ పోటలను బుధవారం అయ్యవారిపల్లి టిడిపి గ్రామ కమీటి అధ్యక్షులు పిన్ని బోయిన రమణయ్య అయ్యవా



రిపల్లి సచివాలయంలో పంచాయితీ కార్యదర్శి మాల్యాద్రికి అందజేశారు.ఈ సందర్భంగా వారు మాట్లాడుతు చిత్తూరు నుండి శ్రీకాకుళం వరకు గతంలో అభివృద్దిని పరిచయం చేసి ప్రస్తుతం శరవేగంగా అభివృద్ధి పనులు కూటమి ప్రభుత్వంలో జరుగుతు న్నాయని అన్నారు. సూపర్ సిక్స్ హామి లను సూపర్ హిట్‌గా చేసి ప్రతి ఒక్కరికి ప్రభుత్వ సంక్షేమపథకాల లబ్ది కూటమి ప్రభుత్వంలో అందుతుందని అన్నారు.ఉదయగిరి నియోజకవర్గంలో ఎమ్మెల్యే కాకర్ల సురేష్ ప్రజలకు ఎల్లవేళలా అందుబాటులో ఉంటు జిల్లాలోనే అభివృద్దిలో ఆదర్శంగా నిలిచేలా ఉదయగిరి నియోజ కవర్గాన్ని తీర్చిదిద్దుతున్నారని అన్నారు. ఈ కార్యక్రమలో సీతారామపురం మండల టిడిపి యూత్ కన్వీనర్ పసుపులేటి వికాస్ బాబు,అయ్యవారిపల్లి గ్రామ కమీటి ప్రధాన కార్యదర్శి బుగ్గవరపు రత్నం, బిజెపి మండలాధ్యక్షులు కాశీరావు,టిడిపి యూనిట్ ఇంచార్జి రేనాటి సుబ్బరాయుడు, తదితరులు పాల్గొన్నారు.

## ప్రతినెలా పేదల ఆకటి తీరుస్తున్న భాస్కర్

**కావలి,డిసెంబర్ 17 ప్రభాతవార్త :** పట్టణం నివాసులు జర్నలిస్టు మారిశెట్టి భాస్కర్ సునీత వారి కుమారుడు వెంకట జయంత్ సహకారంతో సంయుక్త సేవాసంస్థ వ్యవస్థాపక అధ్యక్షులు సురేంద్ర ఆధ్వర్యంలో కావలి మున్సిపాలిటి పరిధిలోని బుడంగుంట గిరిజన కాలనీలో పేదలకు ఎగ్‌బిర్యానీ ప్యాకెట్లు వితరణ చేయడం జరిగింది. ఈ సందర్భంగా సంయుక్త సేవా సంస్థ వ్యవస్థాపక



అధ్యక్షులు సురేంద్ర మాట్లాడుతూ మారిశెట్టి భాస్కర్ కుటుంబసభ్యులు గత పది సంవత్సరాల నుంచి ప్రతినెలా ఒక రోజు పేదలకు ఆకలి తీరుస్తూ మానవత్వాన్ని చాటుకుంటున్నారని తెలిపారు. ఇందులో భాగంగానే గిరిజన కాలనీలో పేదలకు ఆకలి తీర్చారని తెలిపారు. ఈ సందర్భంగా తమ సంస్థ ద్వారా పేదలకు ఆకలి తీర్చన దాతలకు ధన్యవాదాలు తెలిపారు.

## శ్రీనివాస నాయుడు లేఅవుట్ వద్ద ఉన్న కాలువపై కల్వర్టు ఏర్పాటు చేయండి

**పొదలకూరు, డిసెంబర్ 17, ప్రభాతవార్త :** పొదలకూరు పట్టణంలోని శ్రీనివాస నాయుడు లేఅవుట్ నందు ఉన్న కాలువపై తూముపై కల్వర్టు ఏర్పాటు చేయాలని బిజెపి కిసాన్ మోర్చా రాష్ట్ర మాజీ కార్యదర్శి చింతగింజల సుబ్రమణ్యం, బిజెపి నాయకులు



ఇరిగేషన్ ఈఈకి వినతి పత్రం అందజేసారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ శ్రీనివాస నాయుడు లే అవుట్ నందు ఉన్న శ్రీవెంకటేశ్వర స్వామి దేవస్థానం సమీపంలో ఉన్న వాగు పై గతంలో తూము ఉండేదని, తూము కల్వర్టు అక్కడ ప్లాట్లు ఉన్న ఇద్దరి మధ్య వివాదాలు కారణంతో తూమును వారే తొలగించారని అన్నారు. దాంతో ఆ దారి ద్వారా రాకపోకలు సాగించే రమణారెడ్డి కాలనీ, శ్రామిక నగర్, వినాయకమాన్యం వాసులకు చాలా ఇబ్బందిగా ఉంటుందని, తూము కల్వర్టు పూర్తిగా తొలగించడంతో ఆ కాలనీ వాసులు చుట్టూ తిరిగి ప్రయాణించాల్సి వస్తుందన్నారు. అందువల్ల కాలువ పై తూము ను ఏర్పాటు చేయాలని వారు కోరారు. ఈ కార్యక్రమంలో బిజెపి మండల అధ్యక్షులు పి. ప్రకాష్, ఉపాధ్యక్షులు ఆర్. ధనంజయ రావు, సిహెచ్ వెంకటేశ్వర్లు, అశోక్, ప్రతాప్, ప్రశాంత్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.

## కోడూరులో మోటార్ స్టార్టర్లు మాయం!

– 30 మంది రైతుల వ్యవసాయానికి బ్రేక్ పోలీసులకు ఫిర్యాదు



**తోటపల్లి గూడూరు, డిసెంబర్ 17, ప్రభాతవార్త:** తోటపల్లి గూడూరు మండలం కోడూరు గ్రామంలో మంగళవారం అర్ధరాత్రి గుర్తుతెలియని వ్యక్తులు రైతులపై దొంగదెబ్బ తీశారు. గ్రామానికి చెందిన సుమారు 30 మంది రైతుల వ్యవసాయ బోర్ల వద్ద ఉన్న 70 విద్యుత్ మోటార్ స్టార్టర్లు చోరీకి గురయ్యాయి. ఈ విషయం బుధవారం ఉదయం గమనించిన రైతులు వెంటనే డయల్ 100కు ఫోన్ చేసి పోలీసులకు సమాచారం అందించారు. చోరీ ఘటనను కోడూరు రైతులు వేళపాళెం రమేష్ రెడ్డి, అన్నదేవుల విజయ మోహన్ రెడ్డి ధృవీకరించారు. సమాచారం అందుకున్న తోటపల్లి గూడూరు పోలీసులు సంఘటనా స్థలాన్ని పరిశీలించి, రైతుల నుంచి ఫిర్యాదులు స్వీకరించినట్లు తెలిపారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టినట్లు పోలీసులు వెల్లడించారు. రైతుల మాటల్లో, విద్యుత్ మోటార్ స్టార్టర్లు వ్యవసాయానికి ప్రాణం లాంటివి. అవే చోరీకి గురి కావడంతో సాగు పనులు పూర్తిగా నిలిచిపోయి తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నామని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఈ ఘటనలో నిందితులను త్వరగా గుర్తించి, చోరీ అయిన స్టార్టర్లను తిరిగి రైతులకు అందించి న్యాయం చేయాలని రైతులు పోలీసులను కోరుతున్నారు.

## భూ సమస్యల పరిష్కారానికి గ్రామసభ

**దగదర్తి, డిసెంబర్ 17, ప్రభాతవార్త :** మండలంలోని మనుబోలుపాడు గ్రామంలో బుధవారం భూ సమస్యల పరిష్కారానికి ప్రత్యేక గ్రామసభ నిర్వహించడం జరిగింది. తహసీల్దార్ పి.కృష్ణ ప్రజల వద్ద నుండి అర్జీలను స్వీకరించారు. ఈ సందర్భంగా తహసీల్దార్ మాట్లాడుతూ రెవెన్యూ సంబంధిత సమస్యలను వెంటనే పరిష్కరించే విధంగా ప్రభుత్వం



ఒక నెలలో ఒక గ్రామాన్ని ఎంచుకుని నాలుగు గ్రామ సభలు నిర్వహించి గ్రామంలో ఎటువంటి భూముల సమస్యలు లేకుండా చర్యలు తీసుకునేందుకు గ్రామ సభ నిర్వహించడం జరిగిందన్నారు. ప్రజల వద్ద నుండి సుమారు 32 అర్జీలు స్వీకరించామని వీటిని సత్వరమే పరిష్కరిస్తామని తహసీల్దార్ తెలిపారు. ఈ కార్యక్రమంలో ఆర్ఐ ప్రియాంక, వీఆర్వో, నాయకులు పమిడి రవికుమార్ చౌదరి తదితరులు పాల్గొన్నారు.

## సమగ్ర కుటుంబ సర్వేపై సచివాలయ సిబ్బందికి ప్రత్యేక శిక్ష

**తోటపల్లి గూడూరు, డిసెంబర్ 17, ప్రభాతవార్త :** మండల పరిషత్ కార్యాలయంలో బుధవారం ప్రభుత్వం ప్రవేశపెట్టిన సమగ్ర కుటుంబ ఇంటింటి సర్వే (యూనిఫైడ్ ఫ్యామిలీ సర్వే) అమలుపై పంచాయతీ కార్యదర్శులు, సచివాలయ సంక్షేమ అధికారులకు ప్రత్యేక శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా మండల అభివృద్ధి అధికారి కె.



వెంకటేశ్వరరావు మీడియాతో మాట్లాడుతూ, ఈ సర్వే ద్వారా ప్రతి కుటుంబానికి సంబంధించిన సమగ్ర వివరాలను సేకరించడం ద్వారా ప్రభుత్వ సంక్షేమ పథకాలను సమర్థవంతంగా అమలు చేయడానికి అవకాశం ఉంటుందని తెలిపారు. శిక్షణలో భాగంగా సర్వే నిర్వహణ విధానాలను సచివాలయ సిబ్బందికి వివరించి, గురువారం నుంచి ఇంటింటి సర్వే ప్రక్రియ ప్రారంభించనున్నట్లు, జనవరి 12 నాటికి సర్వేను పూర్తిచేయాలనే లక్ష్యంతో పనిచేయాలని సూచించారు. ఈ సర్వే విషయమై గుంటూరులో ప్రత్యేక శిక్షణ పొందిన వెల్ఫేర్ అసిస్టెంట్ సుధీర్, సర్వే బృందం అనుసరించాల్సిన విధి విధానాలను ప్రయోగాత్మకంగా వివరించారు. ఈ శిక్షణ కార్యక్రమంలో మండలంలోని పంచాయతీ కార్యదర్శులు, వివిధ సచివాలయాల వెల్ఫేర్ అసిస్టెంట్లు పాల్గొన్నారు.

## విద్యా వైజ్ఞానిక ప్రదర్శనలతో విద్యార్థుల్లో సృజనాత్మకత వికాసం

**తోటపల్లి గూడూరు, డిసెంబర్ 17, ప్రభాతవార్త :** తోటపల్లి గూడూరు జిల్లా పరిషత్ హై స్కూల్‌లో బుధవారం మండల స్థాయిలో విద్యా వైజ్ఞానిక సదస్సు – ప్రదర్శన కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో మండలంలోని నాలుగు ఉన్నత పాఠశాలలు, కోడూరు బాలికల గురుకుల కళాశాల, మండల పరిషత్ ఉన్నత



మోడల్ పాఠశాలల విద్యార్థులు పాల్గొని వివిధ సాంకేతిక ప్రదర్శనలు, ప్రయోగాలను ప్రదర్శించి తమ ప్రతిభను చాటుకున్నారు. ఈ సందర్భంగా మండల విద్యాశాఖ (2) అధికారి జయరామ నాయుడు పాత్రికేయులతో మాట్లాడుతూ, విద్యా వైజ్ఞానిక ప్రదర్శనల ద్వారా విద్యార్థుల్లో సృజనాత్మక శక్తి, సాంకేతిక నైపుణ్యం పెరుగుతుందని అన్నారు. కొత్త కొత్త ఆలోచనలతో ప్రయోగాలు చేయాలనే దృఢ సంకల్పం విద్యార్థుల్లో ఏర్పడుతుందని, విజ్ఞానాభివృద్ధికి ఇవి దోహదపడతాయని తెలిపారు. మండల స్థాయిలో ప్రథమ, ద్వితీయ, తృతీయ శ్రేణుల్లో ఎంపికైన విద్యార్థులను జిల్లా స్థాయి విద్యా వైజ్ఞానిక ప్రదర్శనలకు పంపించడం జరుగుతుందని ఆయన స్పష్టం చేశారు. ఈ విద్యా వైజ్ఞానిక సదస్సు విజయవంతంగా నిర్వహించడంలో సహకరించిన ప్రధానోపాధ్యాయులు, సైన్స్ ఉపాధ్యాయులను మండల విద్యాశాఖ అధికారి అభినందించారు. ముఖ్యంగా సైన్స్ ఉపాధ్యాయులు యు. శ్రీనివాసరావు, ఎం. మురళి, సిహెచ్.వి. సుబ్బారెడ్డి, చిన్న చెరుకూరుకు చెందిన వి. సుధాకర్ రావు సహా ఆయా పాఠశాలల నుంచి వచ్చిన బాలబాలికలు, పాఠశాల సిబ్బంది ఈ కార్యక్రమంలో ఉత్సాహంగా పాల్గొన్నారు. మొత్తంగా విద్యార్థులలో విజ్ఞాన దృక్పథం పెంపొందించేలా ఈ మండల స్థాయి విద్యా వైజ్ఞానిక ప్రదర్శన సదస్సు ఆదర్శంగా నిలిచిందని పలువురు అభిప్రాయపడ్డారు.

## దిత్వా తుఫాన్ నష్టానికి భరోసా 80 శాతం రాయితీతో వరి విత్తనాల పంపిణీ

**తోటపల్లి గూడూరు, డిసెంబర్ 17, ప్రభాతవార్త:** దిత్వా తుఫాన్ ప్రభావంతో వరి నార్లు దెబ్బతిని తీవ్ర నష్టాన్ని ఎదుర్కొన్న రైతులను ఆదుకు నేందుకు సర్వేపల్లి శాసన సభ్యులు సోమిరెడ్డి చంద్రమోహనరెడ్డి కృషితో ప్రభుత్వం 80 శాతం రాయితీతో వరి విత్తనాలను అందజేసింది. ఈ కార్యక్రమంలో భాగంగా బుధవారం తోటపల్లి గూ



డూరు మండలం నరుకూరు గ్రామ రైతు సేవా కేంద్రంలో నష్టపోయిన రైతులకు వరి విత్తనాల పంపిణీ చేపట్టారు. రైతులు మళ్లీ సాగు ప్రారంభించేందుకు ఈ సహాయం ఎంతో ఉపయోగకరంగా ఉంటుందని అధికారులు తెలిపారు. ఈ కార్యక్రమంలో నరుకూరు ఎంపీటీసీ సభ్యులు కొణతం రఘుబాబు, మాజీ ఎంపీటీసీ సభ్యులు పాకం వెంకయ్య, యూనిట్ ఇంచార్జి ఆరికాటి వెంకటేశ్వర్లు, మండల వ్యవసాయ అధికారి శిరీషారాణి, వ్యవసాయ సహాయకుడు దీపక్‌తో పాటు పలువురు రైతులు పాల్గొన్నారు.

## ఇల్లు దగ్ధమైన శారదమ్మ కుటుంబానికి మత్స్యకార నేతల అండ

**తోటపల్లి గూడూరు, డిసెంబర్ 17, ప్రభాతవార్త:** మండలంలోని కోడూరు పాతపాలెంలో షార్ట్ సర్క్యూట్ కారణంగా జరిగిన అగ్నిప్రమాదంలో ఇల్లు పూర్తిగా దగ్ధమైన కొడూరు శారదమ్మ కుటుంబానికి మత్స్యకార నేతలు కొమారి శ్రీనివాసులు మానవీయంగా స్పందించారు. ఈ ఘటనలో సర్వస్వం కోల్పోయిన నిరుపేద కుటుంబానికి తక్షణ ఉపశమనం కల్పించాలనే ఉద్దేశంతో నిత్యా



వసర సరుకులు, దుప్పట్లు పంపిణీ చేశారు. అగ్నిప్రమాద వార్త తెలిసిన వెంటనే మత్స్యకార సంఘ నాయకులు సంఘటన స్థలానికి చేరుకుని బాధిత కుటుంబాన్ని పరామర్శించారు. ఇల్లు పూర్తిగా కాలిపోయి ఆహారం, దుస్తులు, నిద్రించే ఏర్పాట్లు లేక ఇబ్బందులు పడుతున్న శారదమ్మ కుటుంబానికి బియ్యం, కూరగాయలు, నిత్యావసర సరుకులతో పాటు దుప్పట్లు అందజేశారు. ఈ సందర్భంగా వారు కుటుంబానికి ధైర్యం చెప్పి, అన్ని విధాలుగా అండగా ఉంటామని భరోసా ఇచ్చారు. రోజువారీ కూలీ పనిపై ఆధారపడి జీవనం సాగిస్తున్న శారదమ్మ కుటుంబానికి ఈ సహాయం కొంత ఊరట కలిగించింది. మత్స్యకార నేతల ఈ మానవీయ చర్యను గ్రామస్తులు అభినందించారు. ఇలాంటి కష్ట సమయంలో ప్రభుత్వంతో పాటు స్వచ్ఛంద సంస్థలు, సామాజిక నేతలు ముందుకు రావాలని వారు కోరారు. ఈ సందర్భంగా మత్స్యకార నేతలు మాట్లాడుతూ బాధిత కుటుంబానికి ప్రభుత్వ సహాయం త్వరగా అందేలా అధికారుల దృష్టికి తీసుకెళ్తాం. అవసరమైతే మరింత సహాయం అందించేందుకు సిద్ధంగా ఉన్నాం అని తెలిపారు. గ్రామంలో ఏ కుటుంబం కష్టాల్లో ఉన్నా తాము అండగా ఉంటామని వారు స్పష్టం చేశారు.

## నిరుపేద కుటుంబానికి వీపీఆర్ ఫౌండేషన్ ద్వారా తోపుడు బండి అందజేత

**ఇందుకూరుపేట, డిసెంబర్ 17, ప్రభాతవార్త :** ఇందుకూరుపేట మండలంలోని ముదివర్తిపాలెం గ్రామా నికి చెందిన శ్యామలమ్మ, సంగీత అను ఇద్దరికి వీపీఆర్ ఫౌండేసన్ ద్వారా చిరువ్యాపారులకు తోపుడు బండి ఇవ్వడం జరిగింది. ఈ సహాయానికి మా మం డలం తరుపున మా అమ్మ వేమిరెడ్డి ప్రశాంతిరెడ్డికి, ఎంపీ వేమిరెడ్డి ప్రభాకర్‌రెడ్డికి ధన్యవాదాలు తెలియ జేసుకుంటున్నామని తెలిపారు. ఇందుకూరుపేట టీడీపీ మండల పార్టీ అధ్యక్షులు, ఏకొల్లు పవన్‌రెడ్డి, టీడీపీ నాయకులు నాగరాజు, సుబ్రహ్మణ్యం తదితరులు పాల్గొన్నారు.



## కాటేపల్లిలో వన్‌మంత్ వన్ విలేజ్

**వింజమూరు, డిసెంబర్ 17, ప్రభాతవార్త :** రాష్ట్ర ముఖ్యమంత్రి చంద్ర బాబునాయుడు గ్రామీణ అభివృద్ధి, ప్రజా సమస్య ల పరిష్కారం కోసం వన్ విలేజ్ వన్ మంత్ వన్ విజిట్ అనే వినూత్న కార్యక్రమానికి




శ్రీకారం చుట్టారని తెలుగుదేశం పార్టీ మండల కన్వీనర్ గూడా నర్సారెడ్డి పేర్కొన్నారు. బుధవారం మండలంలోని కాటేపల్లి పంచాయతీలోని సచివాలయంలో జరిగిన వన్ విలేజ్ వన్ మంత్ వన్ విజిట్ కార్యక్రమం డిప్యూటీ తహసీల్దార్ ఓబయ్య అధ్యక్షతన నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిధులుగా గ్రామ పంచాయతీ సర్పంచ్ ముప్పూరి విజయలక్ష్మి తెలుగుదేశం పార్టీ, ఎంపీడీవో శ్రీనివాసులురెడ్డి, ఈవోపీఆర్డీ కొప్పోలు రామారావు హాజరయ్యారు. ఈ సందర్భంగా డిప్యూటీ తహసీల్దార్ ఓబయ్య మాట్లాడుతూ వన్ విలేజ్ వన్ మంత్ ప్రభుత్వ యంత్రాంగాన్ని నేరుగా ప్రజల వద్దకు తీసుకెళ్లడం, క్షేత్ర స్థాయిలో సమస్యలను గుర్తించి అక్కడికక్కడే పరిష్కరించదగివని పరిష్కరించాలని ప్రభుత్వం ఆదేశించింది అన్నారు. ప్రతి నెలలో ఒక రోజు అధికారులందరూ గ్రామాన్ని సందర్శించి ప్రజలతో మమేకమై వారి సమస్యలను తెలుసుకోవడం జరుగుతుందన్నారు. ఈ సమావేశంలో వచ్చిన అర్జీలను పూర్తి స్థాయిలో పరిశీలించి త్వరితగతిన పరిష్కరించడం జరుగుతుందన్నారు. అనంతరం ఎంపీడీవో శ్రీనివాసరెడ్డి గ్రామంలో ఎన్టీఆర్ భరోసా పెన్షన్ల వివరాలను లబ్దిదారులకు అందుతున్న వివరాలను అడిగి తెలుసుకున్నారు. గ్రామ పరిశుభ్రత హరితాంధ్రప్రదేశ్ కోసం చేపట్టాల్సిన అభివృద్ధి కార్యక్రమాలను వివరించారు. ఈ కార్యక్రమం ద్వారా పాలనలో పారదర్శకతను పెంచడంతో పాటు ప్రభుత్వ పథకాలు అర్హులైన వారందరికి సకాలంలో అందుతున్నాయా లేదా అన్న విషయాన్ని స్వయంగా పర్యవేక్షించడం ముఖ్య ఉద్దేశం అన్నారు. గ్రామస్తులు గ్రామంలో నెలకొన్న మంచినీటి సమస్యను అధికారులు దృష్టికి తీసుకువచ్చారు. వెంటనే అధికారులు స్పందించి గ్రామ సమీపంలోని బోరు వద్ద నుండి నీటి పైపులైన్ ఏర్పాటు చేసేందుకు కృషి చేస్తామన్నారు. ఈ కార్యక్రమంలో పంచాయతీ ఈవో నరసింహారెడ్డి, వీఆర్వో రవితేజ, ఏఈవో మనోహర్ నాయుడు, వీపీఏ శారద, సర్వేయర్ మీరావలి తదితరులు పాల్గొన్నారు.

## పారదర్శకంగా యూరియా పంపిణీ

– విదేశాల నుంచి ఎరువుల దిగుమతులు సంతృప్తికరంగా ఉన్నాయి
– రైతులకు అందుబాటులో నానో యూరియా డీఏపీ ఎరువులు
– నెల్లూరు జిల్లా వ్యవసాయాధికారి పి.సత్యవాణి



**నెల్లూరు అగ్రికల్చర్ డిసెంబర్ 17, ప్రభాతవార్త :** నెల్లూరు జిల్లాలో అన్ని పంటలకు అవసరమైన 94,383 మెట్రిక్ టన్నుల యూరియా అందుబాటులో ఉందని రైతులు ఎలాంటి ఆందోళన చెందాల్సిన అవసరం లేదని నెల్లూరు జిల్లా వ్యవసాయ శాఖాధికారి పి.సత్యవాణి బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఇప్పటికి జిల్లాలో ఈ రబీకి 52,173 మెట్రిక్ టన్నుల యూరియా రైతులకు సరఫరా చేయడం జరిగిందన్నారు. 17.12.2025 నాటికి 16 వేల మెట్రిక్ టన్నుల యూరియా అవసరం కాగా, ప్రస్తుతం 18.710 మెట్రిక్ టన్నుల యూరియా అందుబాటులో ఉంచడం జరిగిందన్నారు. విదేశాల నుంచి యూరియా దిగుమతి సంతృప్తికరంగా ఉన్నందున రాబోయే పంట కాలంలో కూడా కొరత ఉండబోదని చెప్పారు. సాంకేతికంగా అభివృద్ధి చేసిన నానో యూరియా నానో డీఏపీ ఎరువులు అందుబాటులో ఉన్నాయని, సాంప్రదాయ ఎరువులకు ప్రత్యామ్నాయంగా రైతులు వాడవచ్చని వివరించారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ఈ నానో ఎరువుల వినియోగాన్ని ప్రోత్సహిస్తున్నాయని తెలిపారు. రైతులు ఈ ఎరువులు కొనుగోలు చేసినప్పుడు అధిక ధరలు చెల్లించకుండా ఎంఆర్పీని పరిశీలించాలని సూచించారు. జిల్లాలో డీలర్లు ఎవరైనా ఎరువుల కృత్రిమ కొరత సృష్టిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని వెల్లడించారు.

## యూనిఫైడ్ ఫ్యామిలీ సర్వేపై సచివాలయ సిబ్బందికి శిక్షణ కార్యక్రమం

**ఉదయగిరి, డిసెంబర్ 17, ప్రభాతవార్త :** మండల కేంద్రమైన ఉదయగిరి స్థానిక శ్రీశక్తి భవనం నందు ఎంపీడీవో శ్రీనివాసరావు ఆధ్వర్యంలో గురువారం సచివాలయ సిబ్బందికి యూనిఫైడ్ ఫ్యామిలీ సర్వేపై శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ఈ సర్వే ద్వారా ప్రజలు సమగ్ర అధికారులను సేకరించడానికి ఉపయోగపడుతుందని, ఆ యొక్క సర్వే గురించి



ఉపయోగాలు, సచివాలయ సిబ్బందికి తెలియజేశారు. సచివాలయ సిబ్బంది ఇంటింటికి వెళ్లి ప్రతి కుటుంబ వివరాలను ప్రతి కుటుంబం నుండి ఆర్థిక సామాజిక విద్య సంబంధిత ఉపాధి వివరాలను సేకరించి యూనిఫైడ్ ఫ్యామిలీ సర్వేను పూర్తి చేయాల్సి ఉందని అదే విధంగా ఈ కుటుంబ సర్వే వలన ప్రజలకు ప్రభుత్వం ద్వారా భవిష్యత్తులో అందచేయు సంక్షేమ కార్యక్రమాలు, లబ్దిదారులు గుర్తించుటకు అవకాశం ఏర్పడుతుందని తెలిపారు. యూనిఫైడ్ సర్వేను నిర్వహించు సచివాలయం సిబ్బందికి కుటుంబ వివరాలు అందజేయడంలో ప్రజలందరూ సహకరించాల్సిందిగా విజ్ఞప్తి చేశారు. యూనిఫైడ్ ఫ్యామిలీ సర్వే శిక్షణ కార్యక్రమంలో మండల పరిషత్ అభివృద్ధి అధికారి శ్రీనివాసులు, డిప్యూటీ మండల పరిషత్ అభివృద్ధి అధికారి ఎస్.మోహన్‌రావు, జీఎస్‌డబ్ల్యూఎస్ మండల పరిషత్ అభివృద్ధి అధికారి సయ్యద్, కరిముల్లా, పంచాయతీ కార్యదర్శులు, సచివాలయం సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

## శ్రీవెంకటేశ్వరస్వామి సన్నిధిలో ధనుర్మాస రెండవ రోజు పూజలు

**వింజమూరు, డిసెంబర్ 17, ప్రభాతవార్త :** ధనుర్మాసాన్ని పురస్కరించుకుని తిరుమల నగర్‌లో వేంచేసియున్న కలియుగ ప్రత్యక్ష దైవం శ్రీ వెంకటేశ్వరస్వామి వారి ఆలయంలో రెండవ రోజు కార్యక్రమానికి ఉభయ దాతలుగా పలుకూరు వెంకయ్య ధర్మపత్ని రాజ్యలక్ష్మి కుటుంబ సభ్యులు ఉభయకర్తలుగా కార్యక్రమాలు జరిపించారు. ఆలయ ప్రధాన అర్చకులు తిరుమల



చారి ఆధ్వర్యంలో ఉభయకర్తలు స్వామివారి పూజా సామాగ్రితో స్వామివారికి ప్రత్యేక అభిషేకాల కార్యక్రమాలు జరిపించారు. అలాగే స్వామివారిని ప్రత్యేకంగా అలంకరించారు. ఉభయకర్తలు స్వామివారి పూజా సామాగ్రితో ముమ్మారు ప్రదక్షిణ చేశారు. ఈ సందర్భంగా తిరుమల దారి మాస ప్రత్యేకతను విశిష్టతను తెలియజేశారు. ఈ కార్యక్రమంలో కృష్ణారెడ్డి దంపతులు తదితరులు ఉన్నారు.

## బాల్య వివాహాలపై మరింత అవగాహన అవసరం

**కోవూరు, డిసెంబరు 17 ప్రభాతవార్త :** బాల్య వివాహాలపై బాలికలు పూర్తిస్థాయిలో అవగాహన చేసుకోవాల్సిన అవసరం ఎంతైనా ఉందని ఐసీపీఎస్ పీవో సమతా తెలిపారు. కోవూరులోని పీఆర్ఎన్ బాలికోన్నత పాఠశాల ప్రాంగణంలో బుధవారం విద్యార్థులకు బాల్య వివాహాలు, గుడ్ టచ్, బ్యాడ్ టచ్ అంశాలపై అవగాహన కల్పించే కార్యక్రమం చేపట్టారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ బాల్య



వివాహాలు చేసుకోవడం వలన ఆరోగ్యపరమైన సమస్యలు బాలికలు ఎదుర్కోవాల్సి వస్తుందన్నారు. దీన్ని దృష్టిలో పెట్టుకుని వివాహ వయస్సు వచ్చే వరకు వివాహాలు చేసుకోకుండా అవగాహన చేసుకోవాలని ఈ సందర్భంగా ఆమె తెలిపారు. వ్యక్తిగత పరిశుభ్రత పరిసరాల పరిశుభ్రత, తదితర అంశాలపై సూపర్‌వైజర్లు ప్రమీల,ఉమా,విద్యార్థులకు అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో ఇన్‌చార్జి ప్రధానోపాధ్యాయిని పర్వీన్, ఉపాధ్యాయులు ఉన్నారు. ఈ సందర్భంగా మానవహారం చేపట్టి ప్రతిజ్ఞ చేయించారు.

## విహారయాత్రకు బయలుదేరిన విద్యార్థులు

**కోవూరు, డిసెంబరు 17 ప్రభాతవార్త :** జిల్లా విద్యాశాఖ ఆదేశాల సూచనల మేరకు కోవూరులోని పచ్చిపాల రామనాథమ్మ జిల్లా పరిషత్ బాలికోన్నత పాఠశాల విద్యార్థులు బుధవారం విజ్ఞాన విహార యాత్రకు బయలుదేరారు. విజ్ఞాన



యాత్రలో వారు నెల్లూరులోని సైన్స్ కేంద్రాన్ని , జైన్ దేవాల యాన్ని సందర్శించి పలు విషయాలపై ఉపాధ్యా యుల ద్వారా అవగాహన కల్పించుకున్నారు. వీరంతా మూడు బస్సుల్లో విజ్ఞాన విహార యాత్రకు బయలుదేరారు. పాఠశాల ప్రధానోపాధ్యాయిని సోఫియా కిరణ్మయి వారికి పలు సూచనలు చేశారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు ఉన్నారు.

## కిచెన్ గార్డెన్‌ల ఏర్పాటు బేష్

**కోవూరు, డిసెంబరు 17 ప్రభాతవార్త :** పూర్వ ప్రాథమిక పాఠశాల విద్యార్థులకు విద్యాబుద్ధులు అందిస్తున్న అంగన్‌వాడీ కేంద్రాలను మరింత ఆదర్శవంతంగా తీర్చిదిద్దేలా అంగన్‌వాడీ కార్యకర్తలు ప్రత్యేక దృష్టి పెట్టాలని ఐసీడీఎస్ ప్రాజెక్టు డైరెక్టర్ హేనాసుజన్ అన్నారు. కోవూరులోని పెళ్లకూరు కాలనీలో ఉన్న అంగన్‌వాడీ కేంద్రాలను బుధవారం ఆమె



పరిశీలించారు. ఈ సందర్భంగా ఆమె ప్రాంగణంలో ఏర్పాటు చేసి ఉన్న కిచెన్ గార్డెన్ పరిసరాలను పరిశీలించి అంగన్‌వాడీ కార్యకర్తలను ప్రత్యేకంగా అభినందించారు. ఈ ప్రాంగణాన్ని మరింత ఆకర్షణీయంగా తీర్చిదిద్దేలా తగు చొరవ తీసుకోవాలన్నారు. ప్రభుత్వం అందిస్తున్న సదుపాయాలను అంగన్‌వాడీ కార్యకర్తలు పూర్తిస్థాయిలో సద్వినియోగం చేసుకోవాలన్నారు. క్రమం తప్పకుండా ప్రతి నెల 10వ తేదిలోపు పిల్లల బరువు, ఎత్తులను తూచి ఆన్‌లైన్‌లో నమోదు చేయాలన్నారు. కేంద్రాలు పరిశుభ్రంగా ఆకర్షణీయంగా ఉండడం పట్ల అంగన్‌వాడీ కార్యకర్తలను అభినందించారు. ఈ కార్యక్రమంలో ఐసీడీఎస్ సూపర్‌వైజర్ ఉమా,అంగన్‌వాడీ కార్యకర్తలు ధనలక్ష్మి, నాగమ్మ, సుమతి, ఆయాలు ఉన్నారు.

## 18 సంవత్సరాలు నిండిన వారు ఓటరు హక్కు కోసం నమోదు చేసుకోవాలి

**కోవూరు, డిసెంబరు 17 ప్రభాతవార్త :** 18 సంవత్సరాలు నిండిన యువత తప్పనిసరిగా ఓటు హక్కు నమోదు చేసుకోవాలని తహసీల్దార్ సీహెచ్ సుబ్బయ్య తెలిపారు. కోవూరులోని తహసీల్దార్ కార్యాలయంలో బుధవారం కోవూరు నియోజకవర్గంలోని అన్ని మండలాల తహసీల్దార్లు , వివిధ



పార్టీల రాజకీయ నాయకులతో ప్రత్యేక సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఓట్లు మార్పులు, చేర్పులు, తొలగింపులు ప్రక్రియ కొనసాగుతుందన్నారు. ఎన్నికల కమిషన్ ఇచ్చిన సూచనలు, సలహాలు ఆయన ఈ సమావేశంలో హాజరైన రాజకీయ పార్టీ నాయకులకు వివరించారు. ఈ కార్యక్రమంలో తహసీల్దార్లు వెంకటేశ్వర్లు, స్ఫూర్తిరెడ్డి, ఎలక్షన్ డిప్యూటీ తహసీల్దార్ సతీష్, ఎలక్షన్ సీనియర్ అసిస్టెంట్ రమణయ్య, రాజకీయ పార్టీల ప్రతినిధులు ఉన్నారు.

## భూమి విస్తరణ తప్పిదాల సరిచేయండి : తహశీల్దార్



**కొడవలూరు,డిసెంబర్ 17 ప్రభాతవార్త :** వన్‌మంత్, వన్ విలేజ్, ఫోర్ విజిట్ కార్యక్రమం ద్వారా రెవెన్యూ ఇతర సమస్యలను శాశ్వత పరిష్కారం చేయాలని జిల్లా కలెక్టర్ ఆదేశాల మేరకు ప్రజాపరిష్కార వేదిక ఏర్పాటు చేయడం జరిగిందని తహశీల్దార్ కె.స్ఫూర్తిరెడ్డి పేర్కొన్నారు. మండలంలోని గండవరం పంచాయితీ కార్యాలయంలో గ్రామసభ కార్యక్రమంలో రెవెన్యూ సమస్యలపై రైతులు అర్జీలు అందజేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ వచ్చిన అర్జీలు ఆరు. వాటిలో భూమి విస్తరణ, తప్పిదాలు వన్‌బి అడంగల్ నమోదు కోసం వచ్చినవి మండల సర్వేయర్ ద్వారా విస్తరణ తప్పిదాలను సరిచేసి అడంగల్, వన్‌బి రికార్డు పత్రాలను పరిశీలన చేసి ఆన్‌లైన్‌లో నమోదు చేయడం తద్వారా శాశ్వత పరిష్కారం చేయడం జరుగుతుందన్నారు ఈకార్యక్రమంలో గ్రామ సర్పంచ్ రాజకుమారి, మండల సర్వేయర్ మహేశ్వరావు, రెవెన్యూ హైమావతి, వీఆర్‌ఓలు షరీఫ్, ఏడుకొండలు, రైతులు, ప్రజలు పాల్గొన్నారు.

## పీ4 స్ఫూర్తితో ఒంటరి వృద్ధ మహిళకు సాయం



**కావలి,డిసెంబర్ 17 ప్రభాతవార్త :** ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు ప్రతిష్టాత్మకంగా తీసుకొచ్చిన పి4 కార్యక్రమం కింద సంయుక్త సేవాసంస్థ చేస్తున్న సేవలను చిత్రీకరించడానికి విజయవాడలోని పీ4 కేంద్ర కారాయలయం నుంచి కావలికి వచ్చిన బృందం సభ్యులు ఎల్.వంశీక్రిష్ణ వృద్ధురాలికి సాయం చేసి మంచి మనసు చాటుకొన్నారు. ఈ సందర్భంగా సంయుక్త సేవా సంస్థ వ్యవస్థాపక అధ్యక్షులు గంగపట్నం సురేంద్ర మాట్లాడారు. కావలి పట్టణంలోని బాలక్రిష్ణారెడ్డినగర్‌లో నివసిస్తున్న ఒంటరి వృద్ధ మహిళ పోలమ్మకు స్వయం ఉపాధి నిమిత్తం సంయక్తు సేవా సంస్థ టిఫిన్ అంగడి ఏర్పాటు చేసింది. ఈ అండికి సంబందించిన వీడియోను పీ4 బృందం చిత్రీకరిసుతన్న క్రమంలో పోలమ్మ ఇంటి రేకులు పగిలిపోయి ఉండడాన్ని గమనించిన వంశీక్రిష్ణ పీ4 స్ఫూర్తితో వెంటనే స్పందించి రేకులకు రూ.5వేలు ఆమె మెడిసిన్ ఖర్చునిమిత్తం మరో వెయ్యి రుపాయలకు అందజేసి దాతృత్వం చాటుకున్నందుకు దన్యవాదాలు తెలిపారు.

## ఏఎస్‌పేటలో జనసేనపార్టీ కార్యకర్తల ఆత్మీయ సమావేశం



**అనుమసముద్రంపేట,డిసెంబరు17,ప్రభాతవార్త :** మండల కేంద్రమైన ఏఎస్‌పేటలో బుధవారం జనసేన పార్టీ మండల అధ్యక్షుడు సయ్యద్ అక్బర్‌బాషా ఆధ్వర్యంలో జనసేన పార్టీ కార్యకర్తల ఆత్మీయ సమావేశాన్ని నిర్వహించారు. ఈసమావేశానికి ముఖ్య అతిథిగా ఆత్మకూరు నియోజకవర్గ జనసేనపార్టీ సీనియర్ నాయకులు చదలవాడ హరీష్‌కుమార్ హాజరయ్యారు. ఈసందర్భంగా ఆయన ప్రస్తుత రాజకీయ పరిణామాలపై విస్తృతంగా చర్చించారు. దాంతోపాటు పార్టీ బలోపేతం కోసం చేపట్టాల్సిన కార్యాచరణపై స్పష్టమైన మార్గదర్శనం అందించారు. ముఖ్యంగా క్రియాశీలక సభ్యత్వాల విస్తరణ, గ్రామస్థాయిలో పార్టీ నిర్మాణాన్ని మరింత పటిష్టం చేయడం, రానున్న లోకల్‌బాడీ ఎన్నికలను లక్ష్యంగా చేసుకొని కార్యాచరణ రూపొందించుకోవాల్సిన అవసరాన్ని వివరించారు. ఈ సమావేశ ప్రధాన లక్ష్యం జనసేన కేడర్‌ను మరింత చురుకుగా మార్చడమేనని, ప్రతి గ్రామంలో పార్టీ బలాన్ని పెంచాలని, రాబోయే ఎన్నికల విజయానికి బలమైన పునాది వేయాలని నాయకులు పేర్కొన్నారు. ఈకార్యక్రమంలో ఫిరోజ్, కాలేష, భానుచంద్ర, రఫి, కొట్టాయా, మస్తాన్, ముకుందా, పవన్‌కళ్యాణ్ , మణి, శ్రీనివాసులు, ఖాజానవాజ్ , జనసేన నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

## నగేష్‌కు కావలి బ్రాహ్మణ మహాసంఘం చేయూత



**కావలి,డిసెంబర్ 17 ప్రభాతవార్త :** కావలి విష్ణాలయం వీధిలో నివసిస్తూ హీరోహోండా షోరూమ్‌లో క్యాషియర్‌గా పనిచేస్తున్న ఎన్‌విజి నగేష్‌కు బ్రెయిన్‌స్ట్రోక్ వచ్చి నెల్లూరు పైనీ ఆసుపత్రిలో చికిత్స పొందుతున్నందున వైద్యసాయం నిమిత్తం కావలిబ్రాహ్మణ మహాసంఘం వారిని ఆర్థికసాయం చేయమని కోరగా వెంటనే స్పందించి బుధవారం రూ.19వేలు ఆర్థికసాయాన్ని అందజేయడం జరిగింది. ఈ సందర్బంగా నగేష్ కావలి బ్రాహ్మణ మహాసంఘానికి కృతజ్ఞతలు తెలిపారు. అనంతరం ప్రెసిడెంట్ పివిఎస్ ప్రసాద్ మట్లాడారు. ఇటీవల వెంగళరావు నగర్‌కు చెందిన సుధాకర్ కుమారుడు ఆనారోగ్య కారణంగా రూ.14వేలు ఇవ్వడం మందులను ఇవ్వడం జరిగిందని ఆర్థికంగా వెనుకబడిన వారికి సంఘం అండగా ఉంటుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో అసోసియేట్ ప్రెసిడెంట్ నందనవనం మధుసూదన్‌రావు, ప్రధాన కార్యదర్శులు టి.శ్రీనివాసులు, ఏవిరమణమూర్తి, వైస్ ప్రెసిడెంట్ టి.వెంకటేశ్వర్లు పాల్గొన్నారు.

## బీదకు జిల్లా అధ్యక్ష పదవిపై గూడా హర్షం



**వింజమూరు, డిసెంబర్ 17, ప్రభాతవార్త :** నెల్లూరు జిల్లాలో తెలుగుదేశం పార్టీకి వెన్నుదన్నుగా ఉంటూ పార్టీ ప్రతిష్టకు కృషి చేసిన ఎమ్మెల్సీ తెలుగుదేశం పార్టీ జాతీయ కార్యదర్శి బీద రవిచంద్ర కూటమి ప్రభుత్వంలో రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు, జిల్లా తెలుగుదేశం పార్టీ అధ్యక్షునిగా బీద రవిచంద్రకు పదవి ఇవ్వడం పట్ల గూడా నర్సారెడ్డి హర్షం వ్యక్తం చేశారు. భవిష్యత్తులో మరిన్ని పదవులు చేపట్టి మరింత ఉన్నత స్థాయికి చేరాలని ఆకాంక్షించారు. పార్టీ కోసం పని చేసిన నాయకులకు, కార్యకర్తలకు అధిష్టానం సముచిత స్థానం కల్పిస్తుంది అన్నదానికి నిదర్శనం అన్నారు.

## కంపసముద్రం ఉన్నతపాఠశాలకు కంప్యూటర్ వితరణ



**మర్రిపాడు ,డిసెంబరు17,ప్రభాతవార్త :** మండలంలోని కంపసముద్రం ఉన్నతపాఠశాలకు గ్రామానికి చెందిన గోపవరం కాంతారెడ్డి ఒక కంప్యూటర్‌ను , ప్రింటర్‌ను బహూకరించారు. ఈ సందర్భంగా జరిగిన కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయుడు సుబ్బారెడ్డి మాట్లాడుతూ గ్రామస్తులు పాఠశాల అవసరాలను గుర్తించి సహాయ సహకారాలు అందజేయడం అభినందనీయమన్నారు. అనంతరం పాఠశాల సిబ్బంది దాత కాంతారెడ్డిని ఘనంగా సత్కరించారు. ఈకార్యక్రమంలో ఉపాధ్యాయులు, ఉపాధ్యాయేతర సిబ్బంది పాల్గొన్నారు.

## విద్యార్థులో పర్యావరణం పట్ల అవగాహన పెరగాలి




**నెల్లూరు, డిసెంబర్ 17, ప్రభాతవార్త –వైద్యం :** పర్యావరణం పట్ల అవగాహన పెంచేందుకు స్థానిక ఎంఎస్‌ఎం హైస్కూల్‌లో బ్రాహ్మణ కార్పొరేషన్ డైరక్టర్ ఉచ్చి భువనేశ్వరి ప్రసాద్ ఆధ్వర్యంలో జరిగిన పర్యావరణ అవగాహన పుస్తకాల పంపిణీ కార్యక్రమంలో మాజీ కార్పొరేటర్ కోటంరెడ్డి సంధ్య పుస్తకాలు పంపిణీ చేసి విద్యార్థుల్లో అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ఒక మంచి కార్యక్రమాన్ని మన ఎంఎస్‌ఎం స్కూల్లో చేపట్టామని విద్యార్థుల్లో పర్యావరణ పట్ల అవగాహన పెరిగే విధంగా పుస్తకాలు వ్రాసిన ఎన్‌ఆర్ఐ స్టూడెంట్ శ్రీరామ్ భీమరాజుకి అభినందనలు తెలియజేశారు. విద్యార్థులు పర్యావరణ పట్ల అవగాహన పెంచుకుని ముఖ్యంగా ప్లాస్టిక్ వాడకాన్ని నిరోధించాలని, ప్లాస్టిక్ బాటిల్‌తో నీళ్ల తాగకుండా గ్లాస్ సీసాలు మెటల్ బాటిల్స్‌తో నీళ్ల తెచ్చుకొని తాగాలని చెప్పారు. ప్లాస్టిక్ వినియోగం కారణంగా పర్యావరణం దెబ్బతినడమే కాకుండా క్యాన్సర్ వ్యాధి ప్రబలడానికి ప్రధాన కారణంగా ప్లాస్టిక్ తయారైందని, విద్యార్థులందరూ ఈ పుస్తకాన్ని క్షుణ్ణంగా చదివి దాంట్లో ఉన్నటువంటి డ్రాయింగ్ వేసి మీతోటి విద్యార్థులకు కూడా అవగాహన కల్పించాలని పిలుపునిచ్చారు. బ్రాహ్మణ కార్పొరేషన్ డైరక్టర్ ఉచ్చి భువనేశ్వరి ప్రసాద్ మాట్లాడుతూ అమెరికాలో 12స్టాండర్డ్ అనగా ఇక్కడ ఇంటర్మీడియట్ రెండవ సంవత్సరం చదివే శ్రీరామ్ భీమ్ రాజ్ మంచి ఆశయంతో పుస్తకాలను తయారు చేశారని, ఆ పుస్తకాలను క్షేత్ర స్థాయిలో పాఠశాలల్లో విద్యార్థులకు పంచి అవగాహన కల్పించడం ద్వారా పర్యావరణాన్ని కాపాడడమే తన ధ్యేయంగా ఈ పుస్తకాన్ని రాశారని, ఇంత మంచి పుస్తకాలు రాసినటువంటి శ్రీరామ్ భీమరాజు కి హృదయపూర్వక అభినందనలు తెలియజేస్తున్నాను అన్నారు. ఈ పుస్తకాలను కడపలోని మాకు మిత్రుడైన జర్నలిస్టు రఘునాథ్ మాకు పంపించి ఒక మంచి పాఠశాలలో పంపిణీ చేయమంటే ఈ రోజు మన ఎమ్మెస్ స్కూల్లో ఈ పుస్తకాలను పంపిణీ చేశామని తెలిపారు. పాఠశాల ప్రధానోపాధ్యాయుడు మురళీకృష్ణ మాట్లాడుతూ ఈ పుస్తకం ఎంతో సమాచారం కూడుకున్నదని విద్యార్థులందరూ దీని క్షుణ్ణంగా చదివి పర్యావరణం పట్ల అవగాహన పెంచుకోవాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఆకుల హనుమంతరావు, అంచూరు శ్రీనివాసులు నాయుడు, పసుపులేటి మల్లిఖార్జునరావు, సుభాన్ భాష, ఆమంచర్ల ప్రభాకర్, నవులూరు శ్రీకృష్ణ, జీవీ రెడ్డి, శ్రీనివాసరావు, మోహన్ నాయుడు, శ్రీహరి, ఫణి, గౌసియా, అలీ, రిటైర్డ్ ఎంప్లాయిస్ నాయకులు చంద్రశేఖర్, విశ్వం, రషీద్, నాగార్జున తదితరులు పాల్గొన్నారు.

## మద్యం సేవించి వాహనాలు నడిపితే భారీ జరిమాన



**సైదాపురం, డిసెంబర్ 17, ప్రభాతవార్త :** సైదాపురం మండలంలో ఎవరైనా మద్యం సేవించి వాహ నాలు నడుపుతూ పట్టుబడితే న్యాయస్థానం ద్వారా రూ.10వేలు జరిమాన విధించడం జరుగుతుందని ఎస్సై కాంతికుమార్ హెచ్చరించారు. సైదాపురంలోని రామసాగరం రోడ్డు సమీపంలో బుధవారం డ్రంక్ అండ్ డ్రైవ్ నిర్వహించారు. ఈ సందర్భంగా ఎస్సై కాంతికుమార్ మాట్లాడుతూ వాహనాలు నడిపే వారు ఖచ్చితంగా సరైన పత్రా లను ఉంచుకోవాలని తెలిపారు. ముఖ్యంగా మద్యం సేవించి వాహనాలు నడిపితే వారికి జరిమాన విధిం చడం జరుగుతుందని హెచ్చరించారు.

## మండల స్థాయి సైన్స్ ఎగ్జిబిషన్



**బిట్రగుంట డిసెంబర్ 17 ప్రభాతవార్త :** బోగోలు మండలం విశ్వనాథరావుపేట జిల్లా పరిషత్ బాలికల ఉన్నత పాఠశాలప్లస్ టూలో బుధవారం మండల స్థాయి సైన్స్ ఎగ్జిబిషన్ నిర్వహించారు. ఈ ఎగ్జిబిషన్లో మండలం లోని ప్రభుత్వ పాఠశాల విద్యార్థులు పాల్గొన్నారు. మొత్తం 60 సైన్స్ వివిధ పరికరాల తయారీని ప్రదర్శి ంచా రు. ఈ ప్రదర్శనలో విద్యార్థుల వ్యక్తి గత విభాగంలో పాత బిట్రగుంట జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలకు చెందిన విద్యార్థి బీవీ భవదీప్, విద్యార్థుల గ్రూపుకు చెందిన వారిలో డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ గురుకుల పాఠశాలకు చెందిన డి. వర్షిత, ఎన్ మనస్విని జిల్లా స్థాయికి ఎంపికయ్యారు. ఉపాధ్యాయుల విభాగంలో తాళ్లూరు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలకు చెందిన వివి నరేంద్ర జిల్లా స్థాయికి ఎంపిక కాబడ్డారు. ఈ కార్యక్రమంలో మండల విద్యాశాఖ అధికారులు నరసింహారావు జయమ్మ తోపాటు క్లస్టర్ ప్రధాన ఉపాధ్యాయురాలు నీరజ,బాలికల ఫస్టటూ ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయుడు గంగాధర్, సైన్స్ ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

## ఉపాధి హామీ చట్టాన్ని నిర్వీర్యం చేసి బిల్లును నిలుపుదల చేయాలి



**కావలి,డిసెంబర్ 17 ప్రభాతవార్త :** ఉపాధి హామీ చట్టాన్ని నిర్వీర్యం చేసి బిల్లును ఉపసంహ రించుకోవాలని వ్యవసాయ కార్మిక సంఘం రాష్ట్ర కమిటీ సభ్యులు తాళ్లూరు మల్యాద్రి తెలిపారు. మండల అఖిలభారత వ్యవసాయ కార్మిక సంఘం ఆధ్వర్యంలో బుధవారం ఆర్డీఓ వంశీక్రిష్ణకు వినతి పత్రాన్ని అందజేసిన అనంతరం ఆయన మాట్లాడుతూ కేంద్రంలోని ఎన్‌డిఏ ప్రభుత్వం ఉపాధి హామీ చటాటన్ని నిర్వీర్యం చేసి బిల్లును పార్లమెంటులో ప్రవేశపెట్టడం జరిగిందని ఈ బిల్లు వల్ల వ్యవసాయ కార్మికులు ఎంతో ఇబ్బందులు పడుతారని తెలిపారు. వెంటనే ఈ బిల్లును పాత పద్దతిలో మహాత్మగాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం ద్వారా రెండు లక్షల యాభై వేల కోట్లు రుపాయల నిధులను కేటాయించి పటిష్టంగా అమలు పరచాలని కేంద్రాన్ని డిమాండ్ చేయడం జరుగుతుందని తెలిపారు. ఈ ప్రాంతంలో ఉపాధిహామీ పనుల బకాయిలు మూడు నెలల నుండి రాలేదని తక్షణం చెల్లించాలని కోరుతున్నామన్నారు. ఈ కార్యక్రమంలో కావలి మండల అధ్యక్షులు పి.సీతారామయ్య, కార్యదర్శి ఎం.రాదాక్రిష్ణయ్య, కార్మిక సంఘం నేతలు పాల్గొన్నారు.

## చెరువు అభివృద్ధికి నిధులు మంజూరు



**వింజమూరు, డిసెంబర్ 17, ప్రభాతవార్త :** వింజమూరు మండలంలోని బలహీనపడిన చెరువుల మరమ్మత్తులకు సుమారు కోటి రూపా యలు నిధులు మంజూరైనట్లు ఏఈ మహేంద్ర పేర్కొన్నారు. మండల తెలుగుదేశం పార్టీ కన్వీనర్ గూడా నర్సారెడ్డి ఇరిగేషన్ ఏఈతో చెరువు అభివృద్ధి పనులపై చర్చించారు. ఎమ్మెల్యే ఆదేశాలు అనుసరించి నాణ్యత ప్రమాణాలతో చెరువు అభివృద్ధి పనులను జరిగేటట్లు అధికారులు పర్యవేక్షించాలని ఆయన కోరారు. ఇప్పటికే ప్రారంభమైన నల్లగొండలో బొడ్డువాగు చెరువుకు రూ.495000, తక్కెళ్ళపాడు చెరువుకు నాలుగు రూ.445000, చంద్రపడియ చెరువుకు రూ.475000, శంఖవరం చెరువుకు రూ.450000, బుక్కాపురంకు రూ.495000, మూటచింతలపాలెం గ్రామ లింగారెడ్డి చెరువుకు రూ.450000, ఎర్రబల్లిపాలెం చెరువుకు రూ.485000, ఆరివేటి కిస్తీపురం చెరువుకు రూ.485000, మలపరాజు వాగు చెరువుకు రూ.495000, బుక్కాపురం పెద్దచెరువుకు రూ.490000 నిధులు మంజూరయ్యాయన్నారు. మంజూరైన నిధులతో బలహీనంగా ఉన్న చెరువు కట్టలను బలోపేతం చేయడం అలాగే సప్లై ఛానల్ పంట కాలువలు పూడికతీత, తూములు, అలుగులు మరమ్మత్తులు చేయడం జరుగుతుందన్నారు. ఈ పనుల వల్ల చెరువు కట్టలు బలపడి నీరు నిల్వ సామర్థ్యం పెరుగుతుందని తద్వారా రైతులకు సాగునీరు అధికంగా వచ్చే అవకాశం ఉంటుందన్నారు. కావున త్వరలో పనులు పూర్తి చేసేందుకు కృషి చేస్తామన్నారు.

## విద్యార్థులు సైన్స్ పట్ల ఆసక్తి కనపర్చాలి



**వింజమూరు, డిసెంబర్ 17, ప్రభాతవార్త :** విద్యార్థులు విద్యార్థి దశ నుండి సైన్స్ పట్ల ఆసక్తిని కనపరచాలని ఎంపీడీవో శ్రీనివాస్ రెడ్డి పేర్కొన్నారు. బుధవారం జిల్లా పరిషత్ బాలుర ఉన్నత పాఠశాలలో జరిగిన మండల స్థాయి సైన్స్ ఫెయిర్‌ను ఎంపీడీవో ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యార్థుల్లో దాగి ఉన్న సృజనాత్మకత, శాస్త్రీయ దృక్పథాన్ని వెలికి తీసేందుకు ఈ వేదిక ఎంతగానో ఉపయోగపడుతుందన్నారు. ప్రస్తుతం విద్యార్థుల్లో సైన్స్ పట్ల ఆసక్తిని పెంచడం సమకాలిన సమస్యలకు శాస్త్రీయ పరిష్కారాలను కనుగొనడం ప్రదర్శన నైపుణ్యాలు, ఆత్మవిశ్వాసాన్ని పెంపొందించడం జరుగుతుందన్నారు. ఈ సైన్స్ ఫెయిర్‌లో కాలుష్యం, ఇంధన పొదుపు, ప్లాస్టిక్ ప్రత్యామ్నాయాలు, బిందు సేద్యం, వ్యవసాయం తక్కువ ఖర్చుతో కూడిన వ్యవసాయ పరికరాలు సోలార్ ఎనర్జీ తదితర ప్రాజెక్టులను విద్యార్థులు ప్రదర్శించారు. చాకలికొండ కాటేపల్లి వింజమూరు బాలుర బాలికల గుండెమడగల, ఊటుకూరు జడ్పీహెచ్‌ఎస్ పాఠశాల విద్యార్థులు, ప్రధానోపాధ్యాయులు ఎంఈఓ మధుసూదన్‌రెడ్డి, ఈఓపీఆర్డీ రామారావు, స్థానిక ప్రధానోపాధ్యాయులు మాలకొండయ్య, ఉపాధ్యాయులు తదితరులు పాల్గొన్నారు.

## రైల్వే లో లగేజ్ పై ఉన్న పరిమితులు ఏంటి?



**నెల్లూరు రూరల్, డిసెంబర్ 17, ప్రభాతవార్త :** రైల్వే లలో ప్రయాణికులు తమ వెంట తెచ్చే లగేజ్ లపై పరిమితులు ఉన్నాయా అని నెల్లూరు పార్లమెంట్ సభ్యులు వేమిరెడ్డి ప్రభాకర్ రెడ్డి ప్రశ్నించారు. రైల్వే స్టేషన్లలో స్కానింగ్ కోసం తీసుకునే చర్యలపై ఆరా తీశారు. అనుమతించదగిన లగేజీని పెంచడానికి/తగ్గించడానికి ఏదైనా ప్రతిపాదన ఉందా అని వివరాలు కోరారు.ఎంపీ వేమిరెడ్డి ప్రభాకర్ రెడ్డి ప్రశ్నలకు కేంద్ర రైల్వేలు, సమాచార ప్రసారం ఎలక్ట్రానిక్స్ సమాచార సాంకేతిక శాఖ మంత్రి అశ్విని వైష్ణవ్ గారు సమాధానం ఇచ్చారు. ప్రస్తుతం, ప్రయాణీకుడు తనతో పాటు కంపార్ట్‌మెంట్ల లోపల సామాను తీసుకెళ్లడానికి తరగతి వారీగా గరిష్ట పరిమితిని నిర్దేశించారని అన్నారు .ప్రయాణీకులు ఉచిత భత్యం కంటే ఎక్కువ సామానును బుక్ చేసుకుని, గరిష్ట పరిమితి వరకు కంపార్ట్‌మెంట్‌లో తీసుకెళ్లడానికి అనుమతి ఉందన్నారు. లగేజీ రేటుకు 1.5 రెట్లు ఛార్జీలు చెల్లిస్తే సరిపోతుందని, 100 సెం.మీ.x60 సెం.మీ.x25 సెం.మీ. (పొడవుxవెడల్పుxఎత్తు) బయటి కొలతలు కలిగిన ట్రంక్‌లు, సూట్‌కేసులు పెట్టెలను ప్రయాణీకుల కంపార్ట్‌మెంట్‌లలో వ్యక్తిగత సామానుగా తీసుకెళ్లడానికి అనుమతి ఉందన్నారు. ట్రంక్‌లు, సూట్‌కేసులు, పెట్టెలు ఏదైనా కొలతలకు మించి ఉంటే, వాటిని ప్రయాణీకుల కంపార్ట్‌మెంట్‌లలో కాకుండా బ్రేక్‌వాన్ (SLRలు)/పార్సెల్ వ్యాన్‌లలో బుక్ చేసుకుని తీసుకెళ్లాల్సి ఉందన్నారు. వ్యాపార వస్తువులను బుకింగ్ చేయడానికి కంపార్ట్‌మెంట్‌లో తీసుకెళ్లడానికి అనుమతి లేదన్నారు. రాష్ట్ర ప్రభుత్వాలు రైల్వేలలో నేరాల నివారణ, గుర్తింపు, నమోదు దర్యాప్తు శాంతిభద్రతలను నిర్వహించడం వంటి బాధ్యతలను కలిగి ఉంటాయనీ, అవి ప్రభుత్వ రైల్వే పోలీస్ (GRP)/జిల్లా పోలీస్ వంటి చట్ట అమలు సంస్థల ద్వారా నిర్వహిస్తాయన్నారు. అయితే, రైల్వే ప్రొటెక్షన్ ఫోర్స్ (RPF) ప్రయాణీకుల ప్రాంతం ప్రయాణీకులకు మెరుగైన రక్షణ భద్రతను అందించడానికి దానికి సంబంధించిన విషయాలకు GRP/జిల్లా పోలీసుల ప్రయత్నాలకు మద్దతు ఇస్తుందనీ తెలిపారు. హ్యాండ్ హెల్డ్ మెటల్ డిటెక్టర్ (HHMD) సహాయంతో శిక్షిణీ సిబ్బంది తనిఖీలు నిర్వహిస్తారనీ, లోహ, నిషేధిత వస్తువులను గుర్తించడానికి వీలుగా స్టేషన్ల ఎంట్రీ & ఎగ్జిట్ గేట్ల వద్ద డోర్ ఫ్రేమ్ మెటల్ డిటెక్టర్ (DFMD)లను ఏర్పాటుచేస్తారన్నారు.సీసీటీవీ కెమెరాల ద్వారా ప్రయాణికుల కదలికలను నిశితంగా పరిశీలిస్తున్నారనీ,అసాధారణ సంఘటనలు జరగకుండా ఉం డటానికి ప్రభుత్వ రైల్వే పోలీసులు (GRP), స్థానిక పోలీసులతో తనిఖీలు చేస్తారని చెప్పారు. నిషేధిత వస్తువులను తీసుకెళ్లకూడదని ప్రయాణీకులకు అవగాహన కల్పించడానికి, గమనంలో లేని ఏవైనా లగేజీని RPF/GRPలు నివేదించడానికి పబ్లిక్‌అడ్రస్ సిస్టమ్ విజువల్ డిస్ప్లేల ద్వారాప్రకటనలు చేయబడతాయనీ తెలిపారు.

## రైతు సేవా కేంద్రాలలో దాణా



**సీతారామపురం డిసెంబర్ 17 ప్రభాతవార్త :** సీతారామపురం మండలంలోని 2 పశువైశ్యశాలల పరిధిలోని రైతు సేవా కేంద్రాలలో పశువులకు దాణా అందుబాటు లో ఉన్నాయని పశువైద్యాధికారి డాక్టర్ ఎస్‌వి రాఘవేంద్ర శర్మ తెలిపారు. 50 శాతం ప్రభుత్వం సబ్సిడితో ఒక బస్తా 555 రూపాయాలకే రైతులకు దాణా అందిస్తామని అన్నారు.నేటి నుండి అన్ని రైతు సేవా కేంద్రాలలో పంపిణి చేస్తామన్నారు.దాణా కావాల్సిన పశుపోషకులు సమీప రైతు సేవ కేంద్రంలోని సిబ్బందని సంప్రదించాలని అన్నారు.

## కొండబిట్రగుంట హైవే వద్ద అండర్ పాస్ ఏర్పాటు చేయండి



**బిట్రగుంట డిసెంబర్ 17 ప్రభాతవార్త :** బోగోలు మండలం కొండబిట్రగుంట హైవే వద్ద అండర్ పాస్ ఏర్పాటు చేయాలని బుధవారం నెల్లూరు ఎంపి వేమిరెడ్డి ప్రభాకర్ రెడ్డి కేంద్రమంత్రి నితిన్ గడ్కరీ కి విజ్ఞప్తి చేశారు. ఈ మేరకు ఆయన కేంద్ర మంత్రికి వినతి పత్రం అందజేశారు.మండలంలోని ముంగమూరు తోటలవద్ద 16 వ నెంబర్ జాతీయ రహదారినుండి వెళ్ళే దారిలో ప్రసిద్ధ పుణ్యక్షేత్రం కొండబిట్రగుంట లోని శ్రీ ప్రసన్న వెంకటేశ్వర స్వామి ఆలయం ఉందని అక్కడ భక్తుల రాకపోకలు ఎక్కువై రెండో తిరుపతిగా విరాజిల్లుతోంది అని అక్కడికి వచ్చే భక్తుల శ్రేయస్సు దృష్ట్యా అండర్ పాస్ ఏర్పాటు చేయాలని కోరారు.. దీనిపైన స్పందించిన మంత్రి పరిశీలిస్తానని హామీ ఇచ్చారు.

## విద్యుత్ శాఖ మంత్రితో సర్వేపల్లి ఎమ్మెల్యే సోమిరెడ్డి సమస్యలపై చర్చ



**ముత్తుకూరు, డిసెంబర్ 17, ప్రభాతవార్త :** సర్వేపల్లి శాసన సభ్యులు మాజీ మంత్రి సోమిరెడ్డి చంద్రమోహన్ రెడ్డి అధ్యక్షతన విద్యుత్ శాఖ మంత్రి గొట్టిపాటి రవికుమార్ క్యాంప్ కార్యాలయంలో విద్యుత్ శాఖ మంత్రి, ఎమ్మెల్యే సోమిరెడ్డి చంద్రమోహన్ రెడ్డి, ఏపీ జెన్కో ఎండి, డైరెక్టర్ల సమక్షంలో నేలటూరు పంచాయతీ పరిధిలోని సమస్యలు మీద వాడి వేడిగా చర్చలు నిర్వహించారు. ప్రధానంగా గ్రామం తరలింపు గురించి మాట్లాడడం ఎస్సీ కాలనీకి మరియు పాలెం కి పునరావాస కోసం భూసేకరణ చేయాలి తెలపగా దీనిపై మంత్రి సానుకూలంగా స్పందించారు. ఏపీ జెన్కో భూ నిర్వాసిత కాంటాక్ట్ కార్మికుల సమస్యలు, పర్మినెంట్ ఉద్యోగాలు, విద్యా అర్హతను సీనియారిటీ ఆధారంగా తీసుకొని గ్రేడ్లు మార్చుట గురించి చర్చించారు. అదేవిధంగా మిగిలిపోయిన ల్యాండ్లోసర్ వారిని కూడా తీసుకోవాలని తెలిపారు. గ్రామ పంచాయతీ ప్రజల కోసం ఎమ్మెల్యే సోమిరెడ్డి చంద్రమోహన్ రెడ్డి కృషి చేస్తున్నారు. ఎమ్మెల్యే సోమిరెడ్డితో పాటు మండల అధ్యక్షులు నీలం మల్లికార్జున యాదవ్, మండల కార్యదర్శి మాచిరెడ్డి శ్రీధర్ రెడ్డి, గ్రామ నాయకులు కార్యకర్తలు పాల్గొన్నారు. గ్రామ పంచాయతీ ప్రజలు కోసం ప్రత్యేకంగా మన రాజధాని అమరావతికి తీసుకెళ్లి మన సమస్యలను మంత్రిగారి దృష్టికి తీసుకెళ్లి పరిష్కరించే విధంగా కృషి చేసిన ప్రజా నాయకుడు సర్వేపల్లి శాసనసభ్యులు సోమిరెడ్డి చంద్రమోహన్ రెడ్డికి నేలటూరు గ్రామ ప్రజలు, ఏపీ జెన్కో నిర్వాసిత కాంటాక్ట్ కార్మికుల తరపున ప్రత్యేక ధన్యవాదాలు తెలియజేసారు. ఈ కార్యక్రమంలో ఈశ్వరయ్య, సురేష్, వావిళ్ళ జనార్ధన్, అక్కయ్యగారి ఏడుకొండలు, స్థానిక నేలటూరు టిడిపి నాయకులు, గ్రామస్తులు తదితరులు పాల్గొన్నారు.

## బిరదవోలులో పొలం పిలుస్తుంది కార్యక్రమం



**పొదలకూరు, డిసెంబర్ 17, ప్రభాతవార్త :** పొదలకూరు మండల పరిధిలోని బిరదవోలు గ్రామంలో పొలం పిలుస్తుంది కార్యక్రమం నిర్వహి ంచారు. ఈ కార్యక్రమంలో జిల్లా వ్యవసాయ అధికారిణి శ్రీమతి పి.సత్య వాణి పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో డిఏవో మాట్లాడుతూ రైతులు అధిక రసాయన ఎరువుల వాడకం తగ్గించి ప్రకృతి వ్యవసాయం పై మొగ్గు చూపాలి, అదే విదంగా సాగు ఖర్చులు తగ్గించుకోవచ్చు. తద్వారా రైతులు ఆరోగ్యకరము ఐనా పంట పండించొచ్చు అని రైతులకు తెలిపారు. నారుమడి యాజమాన్యం గురించి తెలియజేసి, వరి పంట నాటే సమయంలో మరియు వెన్ను దశలో పోటాష్ తప్పకుండా వాడాలి, పోటాష్ వాడటం వలన చీడపీడలు రాకుండా నివారించొచ్చు అని రైతులకు తెలియజేశారు. యూరియా కోసం రైతులు ఆందోళన అవసరం లేదు ఈ డిసెంబర్ చివరికి జిల్లాకు మరో 9000 టన్నుల యూరియా వస్తుంది అని ఆమె రైతులకు తెలిపారు. ఆదే విదంగా వరి పంటకు భీమా ఎకరాకు రూ. 42000 ఇన్సూరెన్స్ అందుకు గాను రైతు చెల్లించవలసినది ఒక ఎకరాకు రూ.168 అని ఆమె తెలిపారు. ఈ కార్యక్రమంలో సహాయ వ్యవసాయ సంచాలకులు శివనాయక్, నర్సోజీరావు, ఏపిసిఎన్ఎఫ్ జిల్లా కోర్డినేటర్ రవిచంద్ర ప్రసాద్, మండల వ్యవసాయ అధికారి వి.ప్రతాప్, సొసైటీ చైర్మన్ తలచీరు మస్తాన్ బాబు, వెన్నపూస, వెంకట రెడ్డి, రమణారెడ్డి, సొసైటీ డైరెక్టర్ మల్లికార్జున యాదవ్, కె వెంకటేశ్వర్లు, సూర్య నారాయణ, పెంచలయ్య, ప్రకృతి వ్యవసాయ సిబ్బంది, రైతులు తదితరులు పాల్గొన్నారు.

## ప్రజల భూ సమస్యలకు శాశ్వత పరిష్కారం చూపుతాం



**నెల్లూరు అగ్రికల్చర్, డిసెంబర్ 17, ప్రభాతవార్త :** జిల్లా కలెక్టర్ హిమాన్షు శుక్లా ఆదేశాల మేరకు ప్రతి నెల ఒక గ్రామాన్ని నాలుగు దఫాలు సందర్శించి ప్రజల సమస్యలకు శాశ్వత పరిష్కార మార్గం చూపుతున్నామని నెల్లూరు రూరల్ మం డల తహసీల్దార్ కృష్ణ ప్రసాద్ తెలిపారు. బుధవారం ఆమంచర్ల గ్రామంలో రెండవ దఫా ప్రజల సమస్యలపై సమీక్ష జరిపి అర్జీలు స్వీకరించడం జరుగుతుందన్నారు. ఈ కార్యక్రమంలో ప్రజల నుంచి 23 సమస్యలపై ఫిర్యాదులు అందినట్లు వివరించారు. వాటిని పరిశీలించి సత్వరమే ఆయా సమస్యలకు శాశ్వత పరిష్కారం చూపుతామని చెప్పారు. ఒక నెలలో ఒక విలేజ్ నాలుగు సందర్శనల కార్యక్రమంలో ప్రజలు విచ్చేసి తమ భూ సమస్యలను పరిష్క రించుకోవాలని కోరారు. ఆమంచర్ల గ్రామంలో ఈ నెలలో 23, 29వ తేదీలలో 10.30గంటలకు నిర్వహించే సమీక్షల్లో ప్రజల భూ సమస్యలకు పరిష్కారం చూపుతామని చెప్పారు. ప్రజలు ఈ కార్యక్రమాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

## విద్యార్థుల సృజనాత్మక ప్రదర్శనకు వేదికగా సైన్స్ ఫెయిర్



**ఉదయగిరి, డిసెంబర్ 17, ప్రభాతవార్త :** ఉదయగిరి మండల విద్యాశాఖాధికారి టి.వెంకటేశ్వర్లు బుధవార ంమం డల స్థాయి సైన్స్ ఫెయిర్ ఎగ్జిబిషన్ ప్రభుత్వ ఉన్నత పాఠ శాల ఉయదగిరి నందు మండల విద్యా శాఖ అధికారి వెంకటే శ్వర్లు, ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయులు జి.శ్రీనివాస రావు సమన్వయంతో ప్రారంభించారు. ఇందులో భాగంగా విద్యార్థులు అద్భుతమైనటువంటి ప్రదర్శనలు ప్రదర్శిం చారని, మండల పరిధిలో గల 11 ఉన్నతపాఠశాలలో నుండి అందరూ హాజరయ్యారని, ఈ మండల స్థాయి సైన్స్ ఫెయిర్‌ను 7 థీమ్స్ గా, విద్యాశాఖ ఆదేశాల మేరకు వర్గీకరించి అందులో 1 సబ్ స్టయిన్ బుల్ అగ్రికల్చర్, 2.వాటర్ మేనేజ్‌మెంట్ అండ్ ఆల్టర్నేటివ్ ప్లాస్టిక్స్, 3. గ్రీన్ ఎనర్జీ, 4.రిక్రియేషనల్ మ్యాథమెటికల్ మోడలింగ్, 5.వాలటర్ కన్జర్వేషన్ అండ్ మేనేజ్‌మెంట్, ఎమర్జింగ్ టెక్నాలజీ, హెల్త్ అండ్ హైజిన్ విభాగాల యందు విద్యార్థుల ప్రదర్శన స్థాయిలను బట్టి 20వ తేదీ జిల్లా స్థాయిలో జరిగే సైన్స్ మేరకు ఎంపిక చేసి పంపుతామని తెలిపారు. ఈ విధమైనటువంటి సైన్స్‌ఫెయిర్లతో విద్యార్థుల్లో సృజనాత్మకత, శాస్త్రీయ పరిశీలన, అభివృద్ధి చెందుతాయి.

## రైతులు విశిష్ట గుర్తింపు సంఖ్యను పొందాలి



**నెల్లూరు అగ్రికల్చర్, డిసెంబర్ 17, ప్రభాతవార్త :** నెల్లూరు జిల్లాలో రైతులు పీఎం కిసాన్ పథకానికి అర్హత సాధించేందుకు విశిష్ట గుర్తింపు సంఖ్యను పొం దాలని అలా కానిచో, రైతులు పీఎం కిసాన్ పథకానికి అర్హులు కారని జిల్లా వ్యవసాయ శాఖ జాయింట్ డైరెక్టర్ పి.సత్యవాణి బుధవారం ఒక ప్రకటనలో తెలి పారు. ఇప్పటి వరకు 1,66,910 మంది రైతులు రిజిస్టర్ అయి ఉన్నారని వీరంతా రైతు విశిష్ట గుర్తిం పు సంఖ్యను పొందాల్సిన అవసరం ఉందని చెప్పారు. కేంద్ర, రాష్ట్ర వ్యవసాయ పథకాల లబ్ది సులభతరంగా పొందేందుకు అంతే కాకుండా భీమా, సబ్సిడీలు, రుణాలు, ప్రభుత్వ పథకాలు త్వరగా అందు తాయని అందుకోసం రైతు విశిష్ట గుర్తింపు సంఖ్య అవసరమని వెల్లడించారు. భవిష్యత్తు పథకాల ప్రయో జనాలను సులభతరం చేసుకునేందుకు స్పష్టమైన గుర్తింపుతో మోసాలు జరగకుండా అరికట్టేందుకు రైతుకు విశిష్ట గుర్తింపు సంఖ్య అవసరం ఉందన్నారు.

## సైదాపురంలో రెండో రోజు కొనసాగిన రిలేనిరాహార దీక్ష



**సైదాపురం, డిసెంబర్ 17, ప్రభాతవార్త** నెల్లూరు జిల్లాలోనే సైదాపురం మండలాన్ని కొనసాగించాలని ఉమ్మడి కార్యచరణ కమిటీ ఆధ్వర్యంలో రెండోరోజు బుధవారం రిలేనిరాహార దీక్షచేపట్టారు. ఈసందర్బంగా ఉమ్మడి ఐక్య కార్యచరణ కమిటీ అధ్యక్షుడు డీపీ పోలయ్య మాట్లాడుతూ సైదాపురం మండలాన్ని తిరుపతి జిల్లాలో విలీనం చేయకుండా నెల్లూరు జిల్లాలోనే కొనసాగించాలని లేకుంటే గూ దూరును జిల్లాగా ఏర్పాటు చేయాలని ఆయన డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో కమిటీ కో కన్వీనర్లు గంగాధర్, షఫీ హారన్, కమిటీ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

## ప్రజల ముంగిటే ప్రజా సమస్యలు పరిష్కారం



**సైదాపురం, డిసెంబర్ 17, ప్రభాతవార్త** ప్రజా సమస్యలు ప్రజల ముంగిటే త్వరిత గతిన పరిష్కారం చేయడం జరుగుతుందని తహసీల్దార్ ఎం.సుభద్ర తెలిపారు. వన్ మంత్ వన్ విలేజ్- ఫోర్ విజిట్స్ లో భాగంగా మండల పరిధిలోని ఊటుకూరు గ్రామంలో రెవెన్యూ, ఇతర సమస్య లపై బుధవారం సమీక్ష నిర్వహిం చారు. ఈ సందర్భంగా వివిధ సమస్యలపై ప్రజల వద్ద నుంచి సుమారు 57 అర్జీలను అధికారులు స్వీకరించారు. ఈ కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ సర్వేపల్లి వెంకటేశ్వర్లు, టీడీపీ నాయకులు దశయ్యానాయుడు, న్యాయవాది నారాయణరావు, ఆర్ఐ ప్రదీప్ కుమార్ తదితర అధికారులు పాల్గొన్నారు.

## ట్రాఫిక్ క్రమబద్ధీకరణకు 30స్టాపర్స్ అందజేత



**కావలి,డిసెంబర్ 17 ప్రభాతవార్త** :పట్టణంలో ట్రాఫిక్‌ను క్రమ బద్ధీకరించేం దుకు నాగార్జున సిమెంటు కంపెనీ వారు 30 స్టాపర్స్ ను కావలి డిఎస్‌పి పి.శ్రీధర్‌కు బుధవారం అందజేయడం జరిగింది. ఈ సందర్బంగా డిఎస్‌పి మాట్లాడారు. కావలి పట్టణంలో ట్రాఫిక్ రోజురజుకు పెరుగుతున్న దృష్ట్యా ట్రాఫిక్‌ను క్రమబద్దీకరించేందుకు నాగార్జున సిమెంటు కంపెనీ వారు స్టాపర్స్ అందజేయడం చాలా సంతోషంగా ఉందని వారికి కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో నాగార్జున సిమెంటు కంపెని సీనియర్ మేనేజర్ కెవి.నందనరావు, జిల్లా సేల్స్ డీలర్ డి.వెంకయ్యలు హాజరయ్యారు.

## గుండెపోటుతో హోంగార్డు మృతి



**లింగసముద్రం, డిసెంబర్ 17, ప్రభాతవార్త** లింగసముద్రం పోలీసు స్టేషన్‌లో హోం గార్డుగా విధులు నిర్వహిస్తున్న కొండలరావు గుండెపోటుతో మృతి చెందారు. మంగళవారం రాత్రి 10.30కి బైక్‌పై తన విధి నిర్వహణకు ఇంటి నుండి పోలీసు స్టేషన్‌కు వెళ్తుండగా మార్గమధ్యంలో ఒక్కసారిగా గుండెనొప్పి రావడంతో అస్వస్థతకు గురయ్యారు. వెంటనే చికిత్స నిమిత్తం ఆసుపత్రికి తరలించగా, అప్పటికే మృతి చెందినట్లు వైద్యులు నిర్ధారించారు. ఆయన అకాలమరణంతో కుటుంబ సభ్యులు, సహచరులు పోలీసులు తీవ్ర విషాదంలో మునిగిపోయారు. స్థానిక ఎస్సై నారా యణ, సిబ్బంది పలువురు సంతాపం తెలిపారు.

## ఫ్యామిలీ బెనిఫిట్ మేనేజ్‌మెంటు సిస్టం అంశంపై కార్యదర్శులకు శిక్షణ

### ప్రతి ఇంటికి వెళ్ళి సర్వే చేయాలి : ఇన్‌చార్జ్ కమిషనర్





**నెల్లూరు కార్పోరేషన్, డిసెంబర్ 17 ప్రభాతవార్త** : రాష్ట్ర ప్రభుత్వం నిర్దేశాల మేరకు నెల్లూరు నగరపాలక సంస్థ పరిధిలోని వార్డు సచివాలయం కార్యదర్శులు అందరికి మాసటర్ ట్రైనర్స్ ఆధ్వర్యంలో స్థానిక కస్తూరిబా కళాక్షేత్రంలో పవర్ పాయింట్ ప్రెజెంటేషన్‌చే బుధవారం ఫ్యామిలీ బెనిఫిట్ మేనేజ్‌మెంటు సిస్టం అంశంపై రెండు విడతల్లో శిక్షణ అందించారు. ఈ శిక్షణలో ఇన్‌చార్జ్ కమీషనర్ లక్ష్మి మాట్లాడుతూ ప్రభుత్వ ఆదేశాల మేరకు ప్రతి ఒక్క వార్డు సచివాలయ కార్యదర్శి తమ పరిధిలో ఫ్యామిలీ బెని ఫిట్ మేనేజ్‌మెంటు సిస్టం సర్వేను చేపట్టాలన్నారు. అందులో భాగంగా డోర్ టు డోర్ తిరిగి ప్రతి ఇంటి నుంచి ఆయా సభ్యుల పూర్తి సామాజిక, ఆర్థిక పరిస్థితి, కులము, ఇతర వివరాలను సర్వే చేసి పరిపూర్ణ నివేధికలను అంద జేయాలని సూచించారు. ఇంటిటా సర్వే కార్యక్రమంలో ప్రతి ఒక్కరూ పాల్గొనాలని కమీషనర్ ఆదేశించారు. శిక్షణ కార్యక్రమంలో నెల్లూరు నగరపాలక సంస్థ సూపరింటెండెంట్‌లు నరేంద్రకుమార్, నాగేశ్వర్‌రావు, మాస్టర్ ట్రైనర్స్, వార్డు సచివాలయ అన్ని విభాగాల కార్యదర్శులు పాల్గొన్నారు.

## వైభవంగా నందిశ్వరుడికి అభిషేకం



**సంగం డిసెంబర్ 17 ప్రభాతవార్త** మండలకేంద్రమైన సంగంలోని సంగమేశ్వరుని సన్నిధిలో ప్రదోష సమయంలో నందేశ్వరునికి ప్రత్యేకాభిషేకాలు చేశారు. త్రయోదశనాడు సంగమేశ్వరునికి, నందీశ్వరుడికి ఒకే సారి హారతి ఇవ్వడం వల్ల ఎటువంటి సమస్యలు ఉన్నా పోతాయని అర్చకులు తెలిపారు. నందీశ్వరుడి అభిషేకం తిలకించేందుకు పెద్దఎత్తున మహిళలు పాల్గొన్నారు. అభిషేకాల అనంతరం భక్తులకు తీర్ధ ప్రసాదాలు అందజేశారు.

## కలువాయి ఉద్యమానికి సహకారం అందిస్తా : మాజీ మంత్రి కాకాణి



**కలువాయి డిసెంబర్ 17 ప్రభాతవార్త** కలువాయి మండలాన్ని ఆత్మకూరు డివిజన్ పరిధి నుండి గూడూరు డివిజన్‌లోని తిరుపతి జిల్లాకు మార్చేందుకు ప్రభుత్వం తీసుకున్న నిర్ణయాన్ని వ్యతిరేఖిస్తు మండల వైసిపి పార్టీ నాయకు లు,శ్రేణులు, కలువాయి జడ్‌పిటిసి అనీల్‌కుమార్‌రెడ్డి ఆధ్వర్యంలో మాజీ మంత్రి కాకాణి గోవర్ధన్‌రెడ్డిని బుధవారం నెల్లూరులో కలిశారు.కలువాయి మండలాన్ని నెల్లూరు జిల్లాలోనే ఉంచేందుకు వారు చేపడుతున్న ఉద్యమాన్ని కాకాణి దృష్టికి తీసుకొని వెళ్ళారు. ప్రజలతో మమేకమై ఈ ఉద్యమాన్ని తారాస్థాయికి తీసుకొని వేల్లేందుకు పూర్తి స్థాయిలో సహాయ సహకారాం అందిస్తానని గోవర్ధన్‌రెడ్డి హామి ఇచ్చారు. టిడిపికి చెందిన ఎమ్మెల్యేలు,మంత్రులు ఈ అంశాన్ని గమనించి కలువాయి మండలాన్ని నెల్లూరు జిల్లాలోనే కొనసాగించాలే చర్యలు తీసుకోవాలని ఆయన డిమాండ్ చేశారు. పార్టీలు రాజకీయాలకు అతీతంగా కలువాయి మండల భవిష్యత్తులకోసం అందరు మద్దతు ఇవ్వాలని ఈనెల 22 వ తేదిన వైఎస్‌ఆర్ కాంగ్రెస్‌పార్టీ తరపున కలువాయి మండలంలో పెద్దఎత్తున ఉద్యమం చేపడతామని కాకాణి గోవర్ధన్‌రెడ్డి పేర్కొన్నారు. ఈ సందర్బంగా పార్టీ మండల కన్వీనర్ మాకిరెడ్డి వెంకట కృష్ణారెడ్డి,పార్టీ శ్రేణులు, కాకాణి గోవర్ధన్‌రెడ్డికి వినతి పత్రం అందజేశారు.ఈకార్యక్రమంలో మండలంలోని అన్ని గ్రామాల ప్రజా ప్రతినిధులు,వైసిపి నాయకులు ఉన్నారు.

## పదో తరగతి ఫలితాలపై ప్రత్యేక దృష్టి సారించాలి



**కోవూరు, డిసెంబరు 17 ప్రభాతవార్త** : కోవూరు మండలంలోని అన్ని ఉన్నత పాఠశాలల్లో రానున్న పదవ తరగతి ఫలితాల పెంపుదలపై మండల ప్రత్యేక అధికారులు చొరవ తీసుకోవాలని మార్కెటింగ్ అసిస్టెంట్ డైరెక్టర్ ప్రత్యేకాధికారి సుజాత తెలిపారు. కోవూరులోని మండల పరిషత్ కార్యాలయ సమావేశ మందిరంలో బుధవారం మండలంలోని అన్ని ఉన్నత పాఠశాలల ప్రత్యేకాధికారులు ప్రాధానోపాధ్యాయులతో ప్రత్యేక సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ప్రతి ఉన్నత పాఠశాలకు జిల్లా కలెక్టర్ ఆదేశాల మేరకు ఒక ప్రత్యేకాధికారిని నియమించడం జరిగిందన్నారు. వారు క్రమం తప్పకుండా ఆ పాఠశాలలో అమలవుతున్న వంద రోజుల ప్రణాళికను పారదర్శకంగా అమలు చేసేలా ప్రత్యేక చొరవ తీసుకోవాలన్నారు. ఈ వంద రోజుల ప్రణాళికలో విద్యాసామర్థ్యం తక్కువగా ఉన్న విద్యార్థులకు గుర్తించి అటువంటి వారిపై ప్రత్యేక దృష్టి సారించేలా ఉపాధ్యాయులకు అవగాహన పెంచాలన్నారు. మండలంలో నూరుశాతం ఫలితాల సాధనే ధ్యేయంగా ప్రతి ఒక్కరూ సమిష్టిగా కృషి చేయాల్సి న అవసరం ఉందన్నారు. ఈ కార్యక్రమంలో ఎంఈవో రహీమ్, ఎంపీడీవో శ్రీహరిరెడ్డిలు పలు సూచనలు చేశారు.

## గ్రామంలోని ఇంటింటికి సర్వే



దగదర్తి, డిసెంబర్ 17, ప్రభాతవార్త దగదర్తి మండల ప్రజా పరిషత్ కార్యాలయంలో ఎంపీడీవో వెంకటేశ్వర్లు ఆధ్వర్యంలో మణికంఠ ట్రైనింగ్ తీసుకొని వచ్చి సచివాలయ సిబ్బంది కియూనిఫైడ్ ఫ్యామిలీ సర్వేకి సంబంధించిన కార్యక్రమం గురించి సచివాలయ సిబ్బందికి ఒక రోజు శిక్షణ ఇవ్వడం జరిగింది.

## చిరు వ్యాపారులకు తోపుడు బండ్లు అందచేసిన ఎమ్మెల్యే ప్రశాంతమ్మ

**విపిఆర్ ఫౌండేషన్ ద్వారా తోపుడు బండ్లు అందచేసి నిరు పేదలకు స్వయం ఉపాధి కల్పన.**
**చిన్న పెట్టుబడితో జీవనోపాధి పొందే చిరు వ్యాపారులకు తోపుడు బండ్లు గొప్ప అవకాశం**
**ఎమ్మెల్యే ప్రశాంతమ్మకు కృతజ్ఞతలు తెలిపిన తోపుడు బండ్లలబ్ధి దారులు**
**కోవూరు ఎమ్మెల్యే వేమిరెడ్డి ప్రశాంతి రెడ్డి**



**కోవూరు, డిసెంబరు 17 ప్రభాతవార్త** :పండ్లు, కూరగాయలు లాంటి చిరు వ్యాపారాలు చేసుకొని జీవనం సాగించే నిరు పేదలు తోపుడు బండ్లతో స్వయం ఉపాధి పొందవచ్చన్నారు ఎమ్మెల్యే వేమిరెడ్డి ప్రశాంతిరెడ్డి నెల్లూరు నగరం మాగుంట లేఔట్ లోని విపిఆర్ నివాసంలో విపిఆర్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో ఆమె 5మంది చిరు వ్యాపారస్థులకు ఆమె తోపుడు బండ్ల పంపిణి చేశారు. కోవూరు నియోజకవర్గంలోని కొడవలూరు, బుచ్చి, కోవూరు మండలాలలో ఒక్కొ క్కరికి ఇందుకూరు పేట మండలం ముదివర్తిలో ఇద్దరు లబ్ది దారులకు కలిపి మొత్తం 5 మందికి ఆమె తో పుడు బండ్లు అందచేశారు. నిరుపేదలు వాళ్ళ కాళ్ళ మీద వాళ్ల నిలబడేలా స్వయం ఉపాధి కల్పించడం కోసమే ఎంపి వేమిరెడ్డి ప్రభాకర్ రెడ్డి సహకారంతో తోపుడు బండ్ల పంపిణి కార్యక్రమాన్ని చేపట్టా మన్నారు ఎమ్మెల్యే ప్రశాంతి రెడ్డి ఎవరి దగ్గరో పని చేసే అవసరం లేకుండా చిన్న పెట్టుబడితో ఆత్మాభిమానంతో బతికేం దుకు ఇదొక గొప్ప అవకాశమన్నారు విపిఆర్ ఫౌండేషన్ ద్వారా చేస్తున్న ఈ చిరు సహాయం తోపుడు బండ్లు అందుకున్న నిరుపేదల జీవితాల్లో వెలుగులు నింపాలని ఎమ్మెల్యే ప్రశాంతి రెడ్డి ఆకాంక్షి ంచారు. అనంతరం తోపుడు బండ్లు అందుకున్న చిరు వ్యాపారులు ఎంపి వేమిరెడ్డి ప్రభాకర్ రెడ్డి, ఎమ్మెల్యే ప్రశాంతి రెడ్డి గార్లకు కృతజ్ఞతలు తెలియ చేసారు. ఈ కార్యక్రమంలో ఇందుకూరు పేట మండల టిడిపి అధ్యక్షులు ఏకొల్లు పవన్ కుమార్ రెడ్డి, రాష్ట్ర MSME డైరెక్టర్ రావెళ్ల వీరేంద్ర నాయుడు, కోవూరు టిడిపి మండల అధ్యక్షులు కొల్లారెడ్డి సుధాకర్ రెడ్డి, జొన్నవాడ ఆలయ మాజీ ఛైర్మెన్ పుట్టా సుబ్రహ్మణ్యం నాయుడు, బుచ్చి పట్టణ కౌన్సిలర్ లక్ష్మి కాంతమ్మ, టిడిపి సీనియర్ నాయకులు జెట్టి మదన్ కుమార్ రెడ్డి, కరకట్ట మల్లికార్జున, బత్తల రమేష్. బండి కిరణ్ పాల్గొన్నారు.

## ఎమ్మెల్యే చొరవతో అభివృద్ధి పనులకు శ్రీకారం



**కోవూరు, డిసెంబరు 17 ప్రభాతవార్త** : కోవూరు ఎమ్మెల్యే వేమిరెడ్డి ప్రశాంతిరెడ్డి చొరవతో వేగూరు గ్రామ పంచాయతీలో బుధవారం 25 లక్షల వ్యయంతో చేపట్టనున్న అభివృద్ధి పనులకు శంకుస్థాపన కార్యక్రమాలు చేపట్టడం జరిగిందని పార్టీ సీనియర్ నాయకులు వేగూరు సుబ్బానాయుడు, సర్పంచ్ అమరావతి తెలిపారు. వేగూరు గ్రామ పంచాయతీలో బుధవారం 15 లక్షల వ్యయంతో నిర్మాణం చేపట్టనున్న అంగన్‌వాడీ కేంద్రానికి శంకుస్థాపన , వేగూరు గ్రామంలో 10 లక్షల వ్యయంతో నిర్మాణం చేపట్టనున్న డ్రైన్‌కు శంకుస్థాపన కార్యక్రమాలు సాంప్రదాయబద్దంగా నిర్వహించారు. ఈ సందర్బంగా వారు మాట్లాడుతూ గత ఐదు సంవత్సరాలుగా ఈ గ్రామంలో అభివృద్ధి కార్యక్రమాలకు నోచుకోలేదని ప్రస్తుతం కోవూరు ఎమ్మెల్యేగా వేమిరెడ్డి ప్రశాంతిరెడ్డి వచ్చిన తర్వాత అభివృద్ధి కార్యక్రమాలు వేగవంతం అయ్యాయన్నారు. అనంతరం శంకుస్థాపన కార్యక్రమాలను చేపట్టారు. ఈ కార్యక్రమంలో ఐసీడీఎస్ సూపర్‌వైజర్ ప్రమీల, అంగన్‌వాడీ కార్యకర్తలు, నేతలు ఉన్నారు.

## జాతీయ ఇంధన పొదుపు వారోత్సవాలు

**- జిల్లా అంతట ఘనంగా నిర్వహణ**



**నెల్లూరు, డిసెంబర్ 17, ప్రభాతవార్త –వైద్యం** జాతీయ ఇంధన పొదుపు వారోత్సవాలలో భాగంగా ఆంధ్రప్రదేశ్ దక్షిణ ప్రాంత విద్యుత్ పంపిణీ సంస్థ చైర్మన్ అండ్ మేనేజింగ్ డైరెక్టర్ లోతేటి శివశంకర్ ఐఏఎస్ సూచనల మేరకు జిల్లా వ్యాప్తంగా ఎలక్యూషన్, క్విజ్ పోటీలు ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో భాగంగా ముందుగా డివిజన్ స్థాయిలో పోటీలు నిర్వహించగా, ఆయా డివిజన్లలో గెలుపొందిన విద్యార్థులతో నెల్లూరు జిల్లాలోని ఐదు డివిజన్ స్థాయిలో పోటీలు నిర్వహించబడ్డాయి. అనంతరం గెలుపొందిన విద్యార్థులతో సర్కిల్ స్థాయి పోటీలు నిర్వహించి జిల్లాకు ప్రాతినిధ్యం వహించే ఒక బృందాన్ని ఏర్పాటు చేయడం జరిగింది. ఏపీఎస్‌పీడీసీఎల్ పరిధిలోని తొమ్మిది జిల్లాల్లో ఈ పోటీలు నిర్వహించబడగా, ఈ రోజు వర్చువల్ విధానంలో తొమ్మిది జిల్లాల విద్యార్థులతో సర్కిల్ స్థాయి పోటీలు నిర్వహించడం జరిగింది. ఈ కార్యక్రమం చైర్మన్ అండ్ మేనేజింగ్ డైరెక్టర్ ఆధ్వర్యంలో జరిగింది ఈ పోటీలలో క్విజ్ విభాగంలో నెల్లూరు జిల్లా మూడవ స్థానం సాధించగా, మొదటి, రెండవ స్థానాలకు వరుసగా కడప, కర్నూలు జిల్లాలు సాధించాయి. ఈ సందర్భంగా చైర్మన్ అండ్ మేనేజింగ్ డైరెక్టర్ మాట్లాడుతూ పోటీలలో ఉత్సాహంగా పాల్గొన్న విద్యార్థులకు అభినందనలు తెలియజేశారు. ఈ కార్యక్రమాన్ని విజయవంతంగా నిర్వహించిన జిల్లా అధికారులను ప్రత్యేకంగా అభినందించారు. సూపరింటెండెంట్ ఇంజనీర్ కే.రాఘవేంద్రం, ఎగ్జిక్యూటీవ్ ఇంజనీర్ (టెక్నికల్) బాలచంద్ర తదితరులు పాల్గొన్నారు.

## ఎమ్మెల్యే సోమిరెడ్డి ఆధ్వర్యంలో సెమీ క్రిస్మస్ సంబరాలు

**- నెల్లూరులోని వేదాయపాలెం కార్యాలయంలో కోలాహల వాతావరణం**



**నెల్లూరు, డిసెంబర్ 17, ప్రభాతవార్త –వైద్యం** నెల్లూరులోని వేదాయపాలెం కార్యాలయంలో కోలాహలం నెలకొంది. ఎమ్మెల్యే సోమిరెడ్డి ఆధ్వర్యంలో ఘనంగా సెమీ క్రిస్మస్ వేడుకలు బుధవారం జరిగాయి. నియోజకవర్గ నలుమూలల నుంచి తరలివచ్చిన క్రైస్తవులు. అలరించిన చిన్నారుల సాంస్కృతిక ప్రదర్శనలు. క్రైస్తవ మతపెద్దలు క్రిస్మస్ సందేశం అందించారు. సర్వేపల్లి ఎమ్మెల్యే సోమిరెడ్డి చంద్రమోహన్‌రెడ్డి క్రిస్మస్ కేక్ కట్ చేసి శుభాకాంక్షలు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్సీ బూదాటి రాధయ్య, మీదూరు రాజశేఖర్, ఊరందూరు సురేంద్రబాబు, ఆశీర్వాదం, మోహన్, భరత్, స్టాన్లీ ప్రకాష్, జాషువా, సర్వేపల్లి నియోజకవర్గ తెలుగుదేశం పార్టీ నాయకులు.

## జీవో నెంబర్ 70 పై ఏపీ ఎన్జీవోస్ హర్షం వ్యక్తం



**నెల్లూరు కలెక్టరేట్, డిసెంబర్ 17, ప్రభాతవార్త** చైల్డ్ కేర్ లీవ్ రూల్స్ విషయంలో పిల్లల గరిష్ఠ వయో పరిమితిని తొలగిస్తూ రాష్ట్ర ప్రభుత్వం నుండి జిఒ ఎంఎస్ 70ని జారీ చేయడంలో విశిష్ట కృషి చేసిన ఏపిఎన్‌జిజిఓస్ సంఘం రాష్ట్ర అధ్యక్షులు ఏ.విద్యాసాగర్‌కి,ప్రధానకార్యదర్శి డి.వి.రమణకి,ఏపిజెఎసి రాష్ట్ర నాయకులు అందరికీ పొట్టి శ్రీరాములు నెల్లూరు జిల్లా మహిళాఉద్యోగిని లందరూ హృదయ పూర్వక ధన్యవాదాలు తెలియజేశారు.

## ఉపాధిలో హామీ పథకంలో లక్ష్య సాధనకు కృషి

**- ప్రాజెక్టు డైరెక్టర్ గంగాభవాని**



**నెల్లూరు కలెక్టరేట్, డిసెంబర్ 17, ప్రభాతవార్త** ఉపాధి హామీ పథకంలో లక్ష్యసాధనకు కృషి చే యాలని జిల్లా నీటి యాజమాన్య సంస్థ (డ్వామా) ప్రాజెక్ట్ డైరెక్టర్ గంగాభవాని సూచించారు. బుధవారం నెల్లూరులోని డ్వామా కార్యాలయంలో పథకానికి సంబంధించిన ఏపీడీలు, ఏపీవోలు, ఈసీలు, జేఈలు, టీఏలు, ఫీల్డ్ అసిస్టెంట్లతో సమావేశమైన ఆమె ఈ సందర్భంగా మాట్లాడు తూ క్షేత్ర స్థాయిలో జరుగుతున్న పనులను ఎప్పటికప్పుడు పరిశీలించాలన్నారు. మండలాలలో జరుగుతున్న ఫామ్ పాండ్స్, క్యాటిల్ షేడ్స్, సోక్ పిట్స్ తదితరాలను పరిశీలించాలన్న పీడీ ఆయా పనుల ప్రగతిని ప్రతిరోజు ఉదయం 10 గంటలకు తనకు తెలియజేయా లన్నారు. లేబర్ టార్గెట్‌కు సంబంధించి మిద్దేశితి లక్ష్యాలను సాధించాలన్న ఆమె కాటన్ షేడ్స్ నిర్మాణం ఈ నెలాఖరుకు పూర్తి చేయాలన్నారు. ప్రతి మండలంలో పురోగతిలో ఉన్న కంపోస్ట్ పిట్స్ నిర్మాణం నిర్దేశించిన విధంగా జరిగేలా చూడాలన్న ఆమె జనవరి నెలాఖరుకు వాటిని పూర్తి చేయాలన్నారు. అదే విధంగా ఫామ్ పాండ్స్ నిర్మాణం జనవరి నెల కొరకు పూర్తి చేయాలన్న ఆమె ప్రతి కారం గ్రామంలోని ఫామ్ పాండ్స్ నిర్మాణం జరపాలన్నారు. ఇక సోషల్ ఆడిట్ రికవరీపై ప్రత్యేక దృష్టి సాధించాలన్న గంగాభవాని నిర్దేశించిన రికవరీని పంచాయతీల వారీగా వసూలు చేయాలన్నారు.

## వన్‌మంత్-వన్ విలేజ్- పోర్ విజిట్స్ కార్యక్రమంలో పాల్గొన్న జాయింట్ కలెక్టర్



**సంగం డిసెంబర్ 17 ప్రభాతవార్త** సంగం మండలం వంగల్లు సచివాలయంలో వనమంత్- వన్ విలేజి- పోర్ విజిట్స్ కార్యక్రమంలో భాగంగా జరుగుతున్న గ్రామ సభను జాయింట్ కలెక్టర్ మొగలి వెంకటేశ్వర్లు పరిశీలించారు. పలు సమస్యలపై వచ్చిన అర్జీలను ఆయన స్వీకరించారు. అర్జీదారులకు ఇబ్బంది కలగకుండా పారదర్శకంగా సమస్యలను పరిష్కరించడమే ఈకార్యక్రమంయొక్క ముఖ్య ఉద్దేశమని అన్నారు. జిల్లా వ్యాప్తంగా పెండింగ్‌లో ఉన్న రెవిన్యూ సమస్యలను పరిష్కరించడానికి జిల్లా కలెక్టర్ ఆదేశాల మేరకు ప్రత్యేక కార్యాచరణతో ముందుకు వెళుతున్నట్లు ఆయన తెలిపారు. గ్రామసభలను ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని అన్నారు. ప్రజలు అందజేసిన అర్జీలను రెవిన్యూ రికార్డులతో సరిపోల్చి భౌతిక స్థితి గతులను బట్టినిర్ణయం తీసుకుంటారని చెప్పారు.ఎంతో కాలంగా పరిష్కారం కాని భూ వివాదాలు,రికార్డులు,సవరణ వంటి అంశాలపై అధికారులు నేరుగా విచారణ జరుపుతారని ఆయనతెలిపారు.ఈకార్యక్రమంలో తహసిల్దారుసోమ్లానాయక్,ఎంపిడిఒ షాలెట్, నాయకులు పగడాల రఘురామయ్య, రెవిన్యూ అధికారులున్నారు.

## చదువుపై దృష్టి పెట్టి నూరు శాతం ఉత్తీర్ణత సాధించాలి



మనుబోలు డిసెంబర్ 17 ప్రభాతవార్త పదోవతరగతి పరీక్షల్లో విద్యార్థులు నూరు శాతం ఉత్తీర్ణతను సాధించాలని ఎంపిడిఒ జలజాక్షి కోరారు. బుధవారం ఆమె మండల కేంద్రంలోని జడ్పీ బాలుర బాలికల హైస్కూల్‌లో జరుగుతున్న 100 డెస్ ప్రోగ్రాంలో పరిశీలించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతు విద్యార్థులు చదువుపై దృష్టి పెట్చి మంచి మార్కులు సాధించాలన్నారు. సెల్ఫోన్‌కు బానిసలు కావద్దన్నారు. పరీక్షలు అయ్యేంతవరకు సెల్ఫోన్ తాకరాదని ఆమె సూచించారు.ఆమె వెంట ప్రధానోపాధ్యాయులు అమూల్య కుమారి, వసంతకుమారి ఉన్నారు.

## అంగన్‌వాడీ కార్యకర్తల సేవలు అమూల్యం

**- ఎమ్మెల్యే వేమిరెడ్డి ప్రశాంతిరెడ్డి**



**కోవూరు, డిసెంబరు 17 ప్రభాతవార్త** : అంగన్‌వాడీ కార్యకర్తలంటే స్టేటస్ పరంగా చిన్న ఉద్యోగమే అయినా చాలా బరువు బాధ్యతలు ఉన్న ఉద్యోగమని ఎమ్మెల్యే వేమిరెడ్డి ప్రశాంతిరెడ్డి అన్నారు. కోవూరులోని ఐసీడీఎస్ కార్యాలయంలో నాలుగు మండలాలకు చెందిన అంగన్‌వాడీ కార్యకర్తలకు 5జీ స్మార్ట్ ఫోన్లను అందజేసిన కార్యక్రమంలో ఆమె ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ బిడ్డ పుట్టక ముందు గర్భిణులకు ఆరోగ్యంపై అవగాహన పౌష్టికాహారం పంపిణీతో పాటు కాన్పు అయ్యాక బాలితలకు సలహాలు, సూచనలు ఇస్తూ బుడిబుడి నడకల చిన్నారులకు అక్షరాభ్యాసం చేసే అంగన్‌వాడీ కార్యకర్తలకు ఆమె అభినందనలు తెలిపారు. అంగన్‌వాడీలంటే తనకెంతో గౌరవమని అందుకే గత వైసీపీ పాలనలో అంగన్‌వాడీ కార్యకర్తలపై పెట్టిన కేసులను ఎత్తివేయాలని అసెంబ్లీలో గళం విప్పానన్నారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు అంగన్‌వాడీల కష్టాలను గుర్తించి మానవత్వంతో స్పందించారన్నారు. అంగన్‌వాడీ కార్యకర్తలు ఉద్యోగ విరమణ చేసిన తర్వాత 1 లక్ష రూపాయలు , ఆయాలు 60 వేలు ప్రయోజనం పొందేలా గ్రాట్యూటీ చెల్లింపునకు ఉత్తర్వులిచ్చారన్నారు. అంగన్‌వాడీ కార్యకర్తల తరపున ముఖ్యమంత్రికి ఎమ్మెల్యే ప్రశాంతిరెడ్డి ధన్యవాదాలు తలెఇయజేశారు. కోవూరు నియోజకవర్గంలోని కోవూరు మండలం 86, విడవలూరు మండలం 75, కొడవలూరు మండలం 81, బుచ్చి మండలం 78 నాలుగు మండలాలకు సంబంధించిన అంగన్‌వాడీలకు మొత్తం 320 సామ్‌సంగ్ 5జీ స్మార్ట్ ఫోన్లను అందజేయడం జరిగిందన్నారు. ఈ కార్యక్రమంలో ఐసీడీఎస్ పీడీ హేనాసుజన్, సీడీపీవో శారద, తహసీల్దార్ సుబ్బయ్య, ఎంపీడీవో శ్రీహరిరెడ్డి, పెన్నా డెల్టా ఆయకట్టు ఛైర్మన్ జెట్టి రాజగోపాల్‌రెడ్డి, జొన్నవాడ ఆలయ ఛైర్మన్ తిరుమూరు అశోక్‌రెడ్డి, టీడీపీ మండల అధ్యక్షుడు కొల్లారెడ్డి సుధాకర్‌రెడ్డి, టీడీపీ సీనియర్ నాయకులునల్లపరెడ్డి సురేష్‌రెడ్డి, ఇంఒ మల్లారెడ్డి, కోవూరు , వేగూరు గ్రామ సర్పంచ్‌లు మాకసిరి విజయమ్మ, అమరావతి ఏఎంసీ మాజీ వైస్ ఛైర్మన్ పెంచలయ్య, ఎంపీటీసీ నాగరాజు,పురుషోత్తమ్, చింతలపూడి పెంచలయ్య, ఆదాల శివారెడ్డి, సుబ్బానాయుడు, మల్లికార్జున్‌రెడ్డి, బాల రవి, తాటిపర్తి విజయారెడ్డి, మల్లికార్జున్‌రెడ్డి, రమణమ్మ, హరి, చిన్నయ్య,కోవూరు నీటి సంఘం అధ్యక్ష ఉపాధ్యక్షులు అత్తిపల్లి శివప్రసాద్‌రెడ్డి, గాదిరాజు సుధాకర్, బత్తల రమేష్ యాదవ్, బాల రవి, ఆదాల శివారెడ్డి, సుబ్బానాయుడు, కరేటి శ్రీనివాసులు, అశోక్‌కుమార్, మధుసూదన్‌రావు, కూటమి నేతలు సుబ్బారావు, అల్తాఫ్, తదితరులు ఉన్నారు. , టీడీపీ, జనసేన, బీజేపీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నాం



## వలేటివారిపాలెం సచివాలయంను సందర్శించిన ఎంపీడీవో



**వలేటివారిపాలెం, డిసెంబర్ 17, ప్రభాతవార్త** వలేటివారి పాలెం సుండి సచివాలయంను ఎంపీడీవో జయ శంకరరవు బుధవారం తనిఖీ చేశారు. ఈ సందర్భంగా పలు రికార్డులను పరి శీలించారు. సచివాలయ సిబ్బంది పలు సూచనలు చేశారు. ప్రజలకు జవాదు దారితనంగా పనిచేయాలని సూచిం చారు. సచివాలయం సిబ్బంది అందరూ హాజరు కావడంతో ఎంపీడీవో సంతృప్తి వ్యక్తం చేశారు.

## బాధ్యతగా విధులు నిర్వర్తించాలి



**వలేటివారిపాలెం, డిసెంబర్ 17, ప్రభాతవార్త** సచివాలయ సిబ్బంది విధులు బాధ్యతతో నిర్వర్తించాలని ఎంపీడీవో జైశంకరరావు సూచించారు. బుధవారం మండలంలోని అయ్యవారిపల్లి, సుండి గ్రామాల్లోని సచివాలయాలను ఎంపీడీవో సందర్శించారు. ఈ సందర్భంగా పలు రికార్డులను పరిశీలించారు. ఎంపీడీవో మా ట్లాడుతూ సచివాలయానికి పలు అవసరాల కోసం ప్రజలను తిప్పుకోకుండా, సకాలంలో వారి పనులు చేయాలని సూచించారు. నేటి నుండి జరగబోవు యూనిఫైడ్ ఫ్యామిలీ సర్వేపై సిబ్బందికి సూచనలు చేశారు. పెండింగ్‌లో ఉన్న సర్వేలన్నీ పూర్తి చేయాలన్నారు.

## యూనిఫైడ్ ఫ్యామిలీ సర్వే పైన శిక్షణ



**బిట్రగుంట డిసెంబర్ 17 ప్రభాతవార్త** బోగోలు మండలపరిషత్ కార్యాలయంలో బుధవారం యూనిఫైడ్ ఫ్యామిలీ సర్వే పైన సచివాలయసిబ్బందికి శిక్షణ ఇచ్చారు. ఎంపిడిఓ సుబ్ర హ్మణ్యం మాట్లాడుతూ సిబ్బంది ప్రభుత్వం నిర్ణయించిన మార్గదర్శక సూత్రాలమేరకు జనవరి 12 లోగా పూర్తి చేయాలని ఆదేశించారు. డిప్యూటీ ఎంపిడిఓ విజయమ్మ సచివాలయసిబ్బంది పాల్గొన్నారు